

ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS
మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 03-05-2025 | సంపుటి - 23 సంచిక - 03 రూ : 4 | పేజీలు: 8

# పేదల ఇంట రేషన్ పండగ!

- మే నెలలోనే కొత్తగా 11.05 లక్షల మంది లబ్ధిదారులు
- తాజాగా 31,084 కుటుంబాలకు కార్డులు
- పాత కార్డుల్లో అదనంగా 10,12,199 మంది పేర్ల నమోదు
- 2.93 కోట్లకు చేరిన మొత్తం లబ్ధిదారుల సంఖ్య

**హైదరాబాద్:** రాష్ట్రంలో మొత్తం రేషన్ లబ్ధిదారుల సంఖ్య 2.93 కోట్లకు చేరింది. ఒక్క మే నెలలోనే 11.05 లక్షల మంది కొత్తగా లబ్ధిదారులయ్యారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి పూర్తయిన పరిశీలన మేరకు 31,084 కుటుంబాలు రేషన్‌కార్డులకు అర్హులుగా తేల్చి డైనమిక్ కీ రిజిస్టర్ (డీకేఆర్)లో నమోదు చేశారు. ఈ కార్డుల్లోని లబ్ధిదారుల సంఖ్య(యూనిట్లు) 93,584. అదేవిధంగా పాత కార్డుల్లో చేర్చేందుకు 10,12,199 మంది కుటుంబ

తరువాయి 2లో





## ఎక్స్‌ప్రెస్ వేపై దిగిన యుద్ధవిమానాలు

- యూపీలో వాయుసేన విన్యాసాలు!

షాజహాన్‌పూర్: పహల్గాం ఉగ్రదాడితో పాకిస్థాన్‌పై భారత్ మెరుపుదాడి చేస్తుందన్న అంచనాల మధ్య మన వాయుసేన విన్యాసాలు చేపట్టింది. శుక్రవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని గంగా ఎక్స్‌ప్రెస్ రహదారిపై యుద్ధవిమానాల టేకాఫ్, ల్యాండింగ్ ఆపరేషన్లు నిర్వహించింది. హైవేలో భాగమైన 3.5 కి.మీ పొడవైన ఎయిర్‌స్ట్రిప్‌లో రఫేల్, సుఖోయ్30 ఎంకేఐ, మిరాజ్ 2000, మిగ్ 29, జాగ్వార్ వంటి

తరువాయి 2లో

## ఇందిరమ్మ ఇంటి వైశాల్యం 600 చ.అడుగులకు మించొద్దు

- కలెక్టర్లతో సమీక్షలో మంత్రి పొంగులేటి ఆదేశాలు

**హైదరాబాద్:** ఇందిరమ్మ ఇంటి వైశాల్యం 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరిగేలా కలెక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, నీట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో శుక్రవారం ఆయన సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ పథకంలో ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ఎంతవరకు పూర్తయితే అంతవరకు.. ఏరోజుకారోజు ఇన్‌ఛార్జి మంత్రుల నుంచి ఆమోదం

తరువాయి 2లో



## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు మద్దతు

- తేల్చిచెప్పిన అమెరికా

వాషింగ్టన్; దిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పౌరులను పాకిస్థాన్ మద్దతుగల ఉగ్రవాదులు దారుణంగా హతమార్చిన ఘటన నేపథ్యంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయంగా భారత్‌కు మద్దతు పెరుగుతోంది. తాము భారత్ పక్షాన నిలుస్తామని అమెరికా స్పష్టం చేయగా, జపాన్ అదే మాట చెప్పింది. సంబంధిత పక్షాలు సంయమనం పాటించాలని బ్రిటన్ పేర్కొంది. ఉగ్రవాదానికి

తరువాయి 2లో





## అమరావతి ఓ అధునాతన శక్తి

- దేశానికే మార్గదర్శకంగా రూపొందుతుంది
- ఆంధ్రప్రదేశ్ ప్రగతికి భుజం కాస్తాం
- రాష్ట్రం ఇప్పుడు సరైన మార్గంలో ప్రయాణిస్తోంది.. వేగం మరింత పెంచాలి
- పెద్దపెద్ద ప్రాజెక్టులు చేపట్టి.. వేగంగా పూర్తి చేయాలంటే చంద్రబాబుకే సాధ్యం
- రాజధాని పునర్నిర్మాణ పనుల ప్రారంభ సభలో ప్రధాని మోదీ
- అమరావతిలో 74 కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



- మూడేళ్లలో అమరావతి నిర్మిస్తాం
- 5 కోట్ల మందీ 'నా రాజధాని' అని గర్వంగా చెప్పకొనేలా ఉంటుంది: సీఎం చంద్రబాబు
- అమరావతి దేశానికే తలమానికం అవుతుంది: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

2లో

## 908 కళాశాలలు.. 3.93 లక్షల సీట్లు

- 3 విడతలుగా 'దోస్త్'
- షెడ్యూల్ విడుదల.. నేటి నుంచి రిజిస్ట్రేషన్
- జూన్ 30న తరగతులు ప్రారంభం

హైదరాబాద్ : డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్‌తెలంగాణ(దోస్త్) ద్వారా డిగ్రీ ప్రవేశాలను మూడు విడతలుగా చేపట్టనున్నారు. విద్యార్థులు శనివారం నుంచి రూ.200 చెల్లించి తొలి విడత ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మూడు విడతల ప్రవేశాలు ముగిసిన అనంతరం జూన్ 30న మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయి. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో

తరువాయి 2లో




## అందాల వేడుకలు.. ముస్తాబవుతున్న వేదికలు

- తుది దశకు మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లు
- హైదరాబాద్‌కు చేరుకున్న మిస్‌వరల్డ్ ఛైర్‌పర్సన్
- 17న రామోజీ ఫిల్మ్‌సిటీకి సుందరీమణులు
- సాగర్, రామప్ప, యాదాద్రి, పోచంపల్లి, పిల్లలమర్రి సైతం సందర్శించేలా ప్రణాళిక




## తెలంగాణ మోడల్‌ను కేంద్రం అనుసరిస్తోంది



- మహేశ్‌కుమార్‌గౌడ్, పొన్నం ప్రభాకర్
- గవర్నర్‌ను కలిసిన కాంగ్రెస్ బీసీ నేతలు

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కులగణననూ జరపాలని నిర్ణయం తీసుకోవడం.. రాహుల్‌గాంధీ, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ

తరువాయి 2లో

# అమరావతి ఓ అధునాతన శక్తి




ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని.. రాష్ట్ర ప్రగతికి భుజం కాస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌ను అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతికి ఉందని ఉద్ఘాటించారు. ''ఇంద్రలోక రాజధాని పేరు అమరావతి.. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి. స్వర్ణాంధ్ర నిర్మాణానికి ఇది శుభసూచిక. స్వర్ణాంధ్ర విజన్‌కు అమరావతి శక్తినిస్తే.. వికసిత్ భారత్‌కు స్వర్ణాంధ్ర బలమవుతుంది'' అని ప్రధాని పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయ సమీపంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులతోపాటు వివిధ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు ఆయన వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా పలుమార్లు తెలుగులోనే మాట్లాడారు. 'అమరావతి దేశానికే మార్గదర్శకంగా మారబోతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని యువత కలలు నిజం చేసే నగరంగా నిలవబోతోంది. ఐటీ, కృత్రిమ మేధ, గ్రీన్ ఎనర్జీ, క్లీన్ ఇండస్ట్రీ, విద్య, ఆరోగ్య రంగాల్లో దేశానికే మార్గదర్శకంగా (లీడింగ్ సిటీ)గా అమరావతి రూపొందుతుంది. ఈ రంగాల్లో మౌలిక వసతుల కల్పనను రికార్డుస్థాయిలో పూర్తి చేసేందుకు అవసరమైన మద్దతును రాష్ట్రానికి కేంద్రం అందిస్తుంది' అని చెప్పారు. 'కలలు కనడమే కాకుండా, వాటిని నిజం చేసుకోవడంలో ఆంధ్ర ప్రజలు ముందుంటారు' అని ప్రశంసించారు.

*** కాంక్రీట్ నిర్మాణాలు కాదు.. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలు**

''రూ.60వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నాం. ఇవి కాంక్రీట్ నిర్మాణాలు కాదు, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలు, ఆకాంక్షలు.. వికసిత్ భారత్ ఆశయాలకు బలమైన పునాదిగా మారబోతున్నాయి' అని మోదీ పేర్కొన్నారు. 'అమరావతి అంటే ఒక సంప్రదాయం, పురోగతితో కలిసి నడిచే భూమి.. బౌద్ధ వారసత్వపు శాంతితోపాటు.. వికసిత భారత్‌ను నిర్మించుకోగల శక్తి అమరావతికి ఉంది. కొత్త అమరావతి, కొత్త ఆంధ్రప్రదేశ్‌కు నాంది' అని చెప్పారు.

*** కూటమి ప్రభుత్వంలో గ్రహాల అనుకూలత**

''2015 సంవత్సరంలో ప్రజా రాజధానికి శంకుస్థాపన చేసే అవకాశం నాకు లభించింది. గత కొన్నేళ్లుగా కేంద్రం అమరావతికి అన్ని విధాలుగా సహాయం అందిస్తోంది. మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకున్నాం. ఇప్పుడు చంద్రబాబు నేతృత్వంలో.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రహాలు అనుకూలించాయి. అమరావతిలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయం, రాజ్‌భవన్ సహా వివిధ భవనాల నిర్మాణాలకు ప్రాధాన్యమిస్తున్నాం' అని మోదీ వివరించారు.

*** చంద్రబాబు నుంచి ఎన్నో తెలుసుకున్నా**

''టెక్నాలజీ నాతో ప్రారంభమైనట్లు సీఎం చంద్రబాబు ప్రశంసిస్తున్నారు.. కానీ మీకో రహస్యం చెబుతాను. గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొత్తలో.. చంద్రబాబు హైదరాబాద్‌లో ఐటీని ఎలా అభివృద్ధి చేస్తున్నారో గమనించాను. దగ్గరగా ఎన్నో తెలుసుకున్నాను. అధికారుల్ని పంపి పరిశీలింపజేశాను. ఆ రోజు తెలుసుకున్న వాటినే ఇప్పుడు అమలు చేసే అవకాశం లభించింది. అమలు చేస్తున్నాను' అని మోదీ పేర్కొన్నారు.

*** బాబు, పవన్.. ఇది మనమే చెయ్యాలి**

''వికసిత్ ఆంధ్రప్రదేశ్ సాధించాలని ఎన్టీఆర్ కలగన్నారు. ఆయన కలను నిజం చేయాలి. అమరావతిని ఆంధ్రప్రదేశ్‌కు, వికసిత్ భారత్‌కు గ్రోత్ ఇంజిన్‌గా తీర్చిదిద్దాలి. ఎన్టీఆర్ కలను నిజం చేస్తాం' అని మోదీ హామీ ఇచ్చారు. ''చంద్రబాబు, పవన్ కల్యాణ్.. ఇది మనం చెయ్యాలి. ఇది మనమే చెయ్యాలి' అని తెలుగులో వ్యాఖ్యానించారు.

*** యోగా దినోత్సవానికి విశాఖ వస్తా**

''ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న చంద్రబాబు ఆహ్వానం మేరకు విశాఖపట్నం వస్తున్నా. ప్రపంచ యోగా దినోత్సవం ప్రకటించి అప్పటికి పదేళ్లవుతుంది. ఆ రోజు ప్రపంచమంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా మనం చేయాలి. ఈ 50 రోజులు ప్రతి గ్రామం, వీధి, ఇళ్లలోనూ యోగాకు ప్రాధాన్యమిస్తూ కార్యక్రమాలు చేయాలి. ప్రపంచ రికార్డు సాధించాలి. చంద్రబాబు నేతృత్వంలో ఇది కచ్చితంగా సాధిస్తామనే నమ్మకం ఉంది. జూన్ 21న అందరం కలిసి యోగా చేద్దాం. ఆ రోజు మొత్తం ప్రపంచ దృష్టి యోగా పైన, ఆంధ్రప్రదేశ్ పైన పడేలా చేద్దాం' అని మోదీ సూచించారు.

## 908 కళాశాలలు.. 3.93 లక్షల సీట్లు




(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం విద్యామండలి ఛైర్మన్, దోస్త్ కన్వీనర్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, విద్యామండలి ఉపాధ్యక్షుడు ఎస్‌కే మహమూద్, కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేశ్ తదితరులు దోస్త్ షెడ్యూల్ విడుదల చేశారు. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్ అమలవుతుందన్నారు. సబ్జెక్టులను ఎంచుకునే బకెట్ విధానం ఈసారీ ఉంటుందని చెప్పారు. దోస్త్ పరిధిలో 908 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలలున్నాయని.. వాటిల్లో 3.93 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విద్యామండలి ఛైర్మన్ దోస్త్ కన్వీనర్‌గా వ్యవహరించాలని ప్రభుత్వం ఆదేశించిందని, ఆ మేరకే తాను నడుచుకుంటున్నానని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. దోస్త్ పరిధిలో, గురుకులాలు, నాన్ దోస్త్ పరిధిలో కలుపుకొంటే మొత్తం రాష్ట్రంలో 4.58 లక్షల డిగ్రీ సీట్లున్నాయని చెప్పారు. దోస్త్ పరిధిలోకి రాకుండా సొంతంగా ప్రవేశాలు జరుపుకొంటున్న ప్రైవేటు కళాశాలలు 70 ఉన్నాయని ఛైర్మన్ చెప్పారు. వాటిని కూడా దోస్త్ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యాశాఖ జేడీ ఆచార్య రాజేందర్‌సింగ్, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ ఆచార్య బాలభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. విద్యామండలి ఉపాధ్యక్షుడు ఆచార్య ఇటిక్యాల పురుషోత్తం ఈ కార్యక్రమానికి గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ఉపాధ్యక్షుడు 1గా ఉన్న తనను సమావేశాలు, కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదన్న అసంతృప్తితో ఆయన దూరంగా ఉన్నట్లు సమాచారం.

### అమ్మాయిలకు హాస్టళ్లు నిర్మిస్తాం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో స్థలం ఉన్న చోట అమ్మాయిలకు హాస్టళ్లు నిర్మిస్తామని కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. దోస్త్ షెడ్యూల్ విడుదల అనంతరం ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డితో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. గతేడాది 14 కళాశాలలు తమకు అదనపు సీట్లు కావాలని అడిగాయని, ప్రభుత్వం నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించాయని చెప్పారు. అయితే శుక్రవారం ఆ కళాశాలల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిందన్నారు.

## తెలంగాణ మోడల్‌ను కేంద్రం అనుసరిస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

విజయమని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణ మోడల్‌ను కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఇప్పటికే తెలంగాణ సర్కారు చేసిన కులగణన ఆధారంగా బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం చేసిన చట్టం అమలుకు పచ్చజెండా ఊపి బీసీల పట్ల కేంద్రం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కాంగ్రెస్ బీసీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపినందుకు గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపారు. మహేశ్‌కుమార్‌గౌడ్, పొన్నంతోపాటు నాయకులు వీహెచ్, కె.కేశవరావు, అంజన్‌కుమార్‌యాదవ్, మధుయాస్కీగౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు విజయశాంతి, బస్వరాజు సారయ్య, ఆమేర్ అలీఖాన్, ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, రాజ్‌ఠాకూర్, దానం నాగేందర్, ప్రకాశ్‌గౌడ్, వీర్లపల్లి శంకర్ తదితరులు గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## అందాల వేడుకలు.. ముస్తాబవుతున్న వేదికలు



హైదరాబాద్: ప్రపంచ సుందరి పోటీలకు భాగ్యనగరం సంసిద్ధమవుతోంది. ప్రతిష్ఠాత్మక పోటీలను నిర్వహించే అవకాశాన్ని చేజిక్కించుకున్న హైదరాబాద్‌లో సుమారు మూడు వారాలపాటు 120 దేశాలకు చెందిన అందాలభామలు సందడి చేయనున్నారు. ఇందుకు తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆయా వేదికల్లో చేపట్టిన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఈ నెల 8లోపు పోటీల్లో పాల్గొంటున్న వివిధ దేశాల సుందరీమణులు హైదరాబాద్ చేరుకోనున్నారు. ఈ నెల 10న గచ్చిబౌలి స్టేడియంలో పోటీలు ప్రారంభం కానున్నాయి. మే 31న ఫైనల్ జరగనుంది. 120 దేశాల సుందరీమణులు రెండు బృందాలుగా వేర్వేరు కార్యక్రమాల్లో భాగస్వాములు కానున్నారు. మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈఓ, ఛైర్‌పర్సన్ జూలియో ఈవెలిన్ మోర్లీ శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చారు. శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు ఆమెకు సంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. పోటీలకు జరుగుతున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించనున్నారు.

### సాయంత్రం వేళల్లోనే అధిక కార్యక్రమాలు..

వేసవి తీవ్రత, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కార్యక్రమాల నిర్వహణ సమయాలపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు రాష్ట్ర పర్యాటకశాఖ అధికారులు పేర్కొన్నారు. సాయంత్రం 4.30 గంటల తర్వాతే అత్యధిక కార్యక్రమాలు ఉన్నాయి. ఇండోర్ కార్యక్రమాలు మాత్రం మూడు రోజులపాటు ఉదయం జరగనున్నాయి. తెలంగాణ రాష్ట్ర పర్యాటకశాఖ, మిస్ వరల్డ్ లిమిటెడ్ సంయుక్తంగా వీటిని నిర్వహిస్తున్నాయి. 120 దేశాల సుందరీమణులు ఈ నెల 17న సాయంత్రం రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శిస్తారు. నాగార్జునసాగర్ సమీపంలోని బుద్ధవనం ప్రాజెక్టు, రామప్ప దేవాలయం, వరంగల్ వేయి స్తంభాలగుడి, ఓరుగల్లు కోట, యాదాద్రి ఆలయం, పోచంపల్లి, పిల్లలమర్రిని సందర్శించనున్నారు. మిగిలిన కార్యక్రమాలకు హైదరాబాద్‌లోని చార్మినార్, చౌమొహల్లా ప్యాలెస్, గచ్చిబౌలి స్టేడియం, హైటెక్స్, శిల్పారామం, శిల్పకళావేదిక ఇతర ప్రాంతాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

### ప్రధాన కార్యక్రమాల షెడ్యూల్

మే 10: తెలంగాణ జానపద, గిరిజన నృత్యాలతో అట్టహాసంగా పోటీలు ప్రారంభం
12: నాగార్జునసాగర్... బుద్ధవనం ప్రాజెక్టు సందర్శన
13: చార్మినార్ లాడ్‌బజార్‌లో హెరిటేజ్ వాక్. అదే రోజు చౌమొహల్లా ప్యాలెస్‌లో మ్యూజికల్ కాన్సర్ట్, వెల్‌కం డిన్నర్
14: ఒక బృందం వరంగల్ వేయిస్తంభాలగుడి, వరంగల్ కోట సందర్శన. మరో బృందం రామప్ప ఆలయ సందర్శన.
15: ఒక బృందం యాదాద్రి ఆలయ సందర్శన. రెండో బృందం పోచంపల్లి సందర్శన
16: ఒక బృందం మెడికల్ టూరిజంలో భాగంగా ఏఐజీ ఆసుపత్రి సందర్శన. మరో బృందం మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రి, ఎకోటూరిజం పార్కు సందర్శన
17: ఉదయం ప్రపంచసుందరి పోటీదారులకు స్పోర్ట్స్ ఫైనల్ , సుందరీమణుల రామోజీ ఫిల్మ్‌సిటీ సందర్శన
18: తెలంగాణ సచివాలయం సందర్శన, తెలంగాణ ప్రగతిపథంపై కార్యక్రమం, తెలంగాణ పోలీసు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సందర్శన తెలంగాణలో పర్యాటకుల భద్రతకు ఇస్తున్న ప్రాధాన్యం, కార్యక్రమాల వివరణ
20, 21: టీహబ్ సందర్శన, ఖండాలవారీగా ఎంపిక ప్రక్రియ
21: ఒక బృందం ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌ను తిలకిస్తుంది. మరో బృందం శిల్పారామంలో ఆర్ట్స్, క్రాఫ్ట్స్ వర్క్‌షాపులో పాల్గొంటుంది.
22: మిస్‌వరల్డ్ టాలెంట్ ఫైనల్
23: మిస్‌వరల్డ్ హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ఫైనల్
26: హైటెక్స్ వేదికగా బ్యూటీ విత్ పర్పస్, గాలా డిన్నర్
31: హైటెక్స్ వేదికగా మిస్‌వరల్డ్ ఫైనల్ పోటీ
జూన్ 2: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం, మిస్ వరల్డ్ విజేత రాజ్‌భవన్‌లో గవర్నర్, సీఎంని కలుస్తారు. రాజ్‌భవన్‌లో హై టీ.

## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా తాము భారత్ పక్షాన నిలబడతామని అగ్రరాజ్యం పేర్కొంది. ప్రధాని నరేంద్రమోదీకి సంపూర్ణ మద్దతు ఇస్తామని అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి టామీ బ్రూస్ వెల్లడించారు. ఆమె రోజువారీ విలేకరుల భేటీలో గురువారం ఈ వ్యాఖ్యలు చేశారు.

### భారత్ ప్రతిస్పందన సరైందే: వాన్స్

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఉగ్రవాదం విషయంలో భారత్ పక్షానే స్పందించారు. ''పర్యాటకులపై ఉగ్రదాడి ఘటన దిగ్భ్రాంతికరం. దీనికి భారత్ ప్రతిస్పందించడం సరైనదే. అయితే, అది విస్తృత ప్రాంతీయ సంఘర్షణలకు దారితీయని విధంగా ఉంటుందని మేం విశ్వసిస్తున్నాం. పాకిస్థాన్ కూడా ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆశిస్తున్నాం'' అని జేడీ వాన్స్ ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేసే పోరాటంలో అమెరికా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన భరోసానిచ్చారు.

### సంయమనంతో వ్యవహరించాలి: బ్రిటన్

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌పాక్ మధ్య తలెత్తిన ఉద్రిక్త పరిస్థితులను చల్లబరచాల్సిన అవసరం ఉందని బ్రిటన్ పేర్కొంది. ఉగ్రవాదుల పాశవిక దాడిపై చర్చించిన హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో సభ్యులు పార్టీలకతీతంగా ఖండించారు. ఈ క్రమంలో బ్రిటన్ విదేశీ వ్యవహారాలమంత్రి డేవిడ్ లామి భారత్, పాక్ విదేశీ వ్యవహారాల మంత్రులతో మాట్లాడారు. బ్రిటన్ విదేశీ వ్యవహారాలు, కామన్వెల్త్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీస్ (ఎఫ్‌సీడీవో) మంత్రి లార్డ్ రే కొలిన్స్ ప్రభుత్వం తరఫున మాట్లాడుతూ.. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో అన్ని భాగస్వామ్య పక్షాలు సంయమనంతో వ్యవహరించడాన్ని తాము ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

### వెన్నుదన్నుగా నిలబడతాం: జపాన్

ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని జపాన్ హౌస్ ఆఫ్ రిప్రజెంటెటివ్స్ స్పీకర్ నుకగ ఫుకుషిరో ప్రకటించారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించారు. భారత పర్యటను వచ్చిన ఆయన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఉగ్రవాద నిర్మూలనలో భారత్‌కు తమ సంఘీభావం తెలిపారు.

## ఇందిరమ్మ ఇంటి వైశాల్యం 600 చ.అడుగులకు మించొద్దు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని స్పష్టంచేశారు. ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంత పేదలకు కనీసం 500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. ఎంపికైనవారు అనర్హులని తేలితే ఇంటి నిర్మాణం మధ్యలో ఉన్నా రద్దు చేస్తామని స్పష్టంచేశారు. భూభారతి కార్యక్రమానికి సంబంధించి గత నెలలో 4 మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈ నెల 5 నుంచి 20 వరకు జిల్లాకొక మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. గత నెలలో నిర్వహించిన 4 మండలాల్లో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 31లోగా పరిష్కరించాలన్నారు. పెండింగులో పెడితే.. దరఖాస్తుదారుకు లిఖిత పూర్వకంగా కారణాలు తెలిపి తిరస్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని ఆదేశించారు. ఎసైన్డ్ భూములకు పట్టా లేనివారు, పట్టా ఉన్నా ఆ భూమిని సాగుచేయని వారి వివరాలను సేకరించాలని సూచించారు.

### నీట్‌కు 190 పరీక్ష కేంద్రాలు

ఈ నెల 4న జరగనున్న నీట్ పరీక్షకు రాష్ట్రం నుంచి 72,572 మంది విద్యార్థులు హాజరవుతున్నారని... ఇందుకోసం 24 జిల్లాల్లో 190 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశామని మంత్రి తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటితోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్‌లను అందుబాటులో ఉంచాలన్నారు.

## పేదల ఇంట రేషన్ పండగ!




(మొదటిపేజీ తరువాయి)

సభ్యులను అర్హులుగా తేల్చి డీకేఆర్‌లో నమోదుచేశారు. ఇలా మొత్తం 11.05 లక్షల మంది మే నెల నుంచి కొత్తగా రేషన్ పొందేందుకు అర్హులయ్యారు. వీరందరికీ మే నుంచే రేషన్ కార్డుపై ఉచితంగా సన్నబియ్యం అందనున్నాయి. దీంతో ఇప్పటివరకు ఉన్నవారితోపాటు కొత్తవారికీ కలిపి అవసరమైన రేషన్ అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు రేషన్ బియ్యం కోటా అదనంగా 4,431 టన్నులు పెంచి సరఫరా చేస్తున్నారు.

### 1.86 లక్షల టన్నుల కోటా

రేషన్ లబ్ధిదారులకు బియ్యం కోటా 2025 జనవరిలో 1.79 లక్షల టన్నులు ఉండగా, మే నెల వచ్చేసరికే 1.86 లక్షల టన్నులకు పెరిగింది. దరఖాస్తుల్ని పరిశీలించి విడతలవారీగా కార్డులు జారీ చేస్తున్నారు. ఇప్పటికే ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల్ని చేరుస్తున్నారు. పెళ్లికి ముందు వేర్వేరు కుటుంబ కార్డుల్లో ఉన్న భార్యాభర్తలకు కొత్తగా ఒకే కార్డు జారీ చేస్తున్నారు. మీసేవ కేంద్రాల ద్వారా రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల్లో పరిశీలించాల్సినవి ఇంకా మూడు లక్షలు ఉన్నట్లు సమాచారం.

## ఎక్స్‌ప్రెస్ వేపై దిగిన యుద్ధవిమానాలు

(మొదటిపేజీ తరువాయి)

ఫైటర్లు, సి130జె, ఏఎన్32 వంటి సైనిక రవాణా విమానాలు, ఎంఐ17వి5 హెలికాప్టర్ల సన్నద్ధతను పరీక్షించింది. కేవలం మీటరు ఎత్తులో ఫైటర్‌జెట్లు ప్రదర్శించిన విన్యాసం ఆకట్టుకుంది. యుద్ధసమయాల్లో విమానాశ్రయాల్లోని రన్‌వేలకు ప్రత్యామ్నాయంగా ఎక్స్‌ప్రెస్ హైవేలను ఉపయోగించుకోవడానికి సన్నాహకంగా ఈ అభ్యాసాల్ని చేపట్టారు. రాత్రి వేళల్లోనూ యుద్ధవిమానాలు టేకాఫ్, ల్యాండింగ్ అయ్యేలా దేశంలోనే తొలిసారి ఈ ఎయిర్‌స్ట్రిప్ సిద్ధం చేశారు. తాజా విన్యాసాల నేపథ్యంలో యూపీ ప్రభుత్వం అనేక జాగ్రత్తలు తీసుకుంది. ఎయిర్‌స్ట్రిప్ వద్ద దాదాపు 250 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. చుట్టూ 40 కిలోమీటర్ల విస్తీర్ణంలో భద్రత కల్పించింది. రహదారిపైకి జంతువులేవీ రాకుండా చర్యలు తీసుకుంది. యూపీలో యుద్ధ విమానాలు దిగేలా నిర్మించిన నాలుగో ఎక్స్‌ప్రెస్‌వే ఇది. ఆగ్రాలఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్‌వే, పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే, బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌వేపై యుద్ధవిమానాల ల్యాండింగ్ సౌకర్యాలున్నాయి.

# పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

*** అభినందించిన పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ లయన్ డాక్టర్. వినోద్ జాదవ్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : కృషి,పట్టుదల ఉంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చు అని నిరూపించారు బ్రైట్ కాన్సెప్ట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు.ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో రంగారెడ్డి నగర్ డివిజన్ రంగారెడ్డినగర్ ప్రాంతంలో గల బ్రైట్ కాన్సెప్ట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారు. కే.శృతి (573/600), ముఫ్టీన్ (565/600), లక్ష్మీ ప్రసన్న (564/600), బి.ప్రవీణ్ (563/600), శివం కుమార్ ఝా (561/600), అనురాగ్ యాదవ్ (557/600), రుతుజా బొరోలే (557/600), అంబటి హాసిని (556/600), సి.రుచిత(555/600), జోయ తబస్సుమ్ (554/600) తో పాటు 30 మంది విద్యార్థులు 500 పైగా మార్కులతో విజయబావుటా ఎగరవేశారు.97% శాతంతో ఉత్తీర్ణత ఫలితాలు సాధించి ఈ ప్రాంతానికే తలమానికంగా నిలవడం ఎంతో గర్వకారణంగా ఉందని పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ లయన్ డాక్టర్. వినోద్ జాదవ్ సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల క్యాంపస్ హాల్లో శుక్రవారం అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అధ్యాపక బృందంతో కలిసి పుష్పగుచ్ఛాలతో సన్మానిస్తూ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం,ఉపాధ్యాయుల కృషి,విద్యార్థుల అకుంఠితదీక్ష తో ఇంతటి గొప్ప ఫలితాలు సాధించగలిగామన్నారు.ఇదే స్ఫూర్తితో చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగాలని విద్యార్థులను ఆశీర్వదించారు..పారిశ్రామిక వాడ ప్రాంతం కావడంతో అత్యధికంగా కార్మికులు, కర్షకులు,పేదలు నివసిస్తుంటారని, సాధారణమైన ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రతి సంవత్సరం అసాధారణ ఫలితాలు సాధిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ఆయేషా బేగం, ఉపాధ్యాయులు వికాస్, ప్రభు, నాగార్జున, ముంతాజ్ బేగం, శ్రీదేవి, అంబిక, తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

## గోపాల్ యాదవ్ అంకితభవంతో పని చేశారు

**: రాముయాదవ్**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఉద్యోగులు పని చేసినన్ని రోజులు అంకితభవంతో పని చేస్తే వారికి జీవితంతం గర్తింపు ఉంటుందని మాజీ కౌన్సిలర్ పూలపల్లి రాముయాదవ్ అన్నారు. కుషాయిగూడ అర్టీసి డిపోలో అడిషనల్ డిపో క్లర్క్ గా పని చేసిన బొల్లం గోపాల్ యాదవ్ పదవీ విరమణ పొందారు. కుషాయిగూడ డిపోలో ఏర్పాటు చేసిన వీడుకోలు సమావేశంలో గోపాల్ యాదవ్ దంపతులను నాయకులు బోదాన్ లక్ష్మి నారాయణ మిట్టపల్లి విజయ్ గౌడ్లతో కలసి రాములయాదవ్ ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాల్ యాదవ్ ఉద్యోగాన్ని దైవ కార్యంగా భవించి ఉద్యోగం చేశారని గోపాల్ యాదవ్ ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారని అన్నారు. ఈసందర్భంగా గోపాల్ యాదవ్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపో మ్యానేజర్ మహేష్ కుమార్, నాయకులు లక్ష్మినారయణ, విజయ్డ్, బేతాల బాల్రాజు డిపో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాగన్ పల్లి (నైనంపల్లి) గ్రామానికి చెందిన బీఎస్పీ నాయకులు చెరుకూరి యాదగిరి తండ్రీ గారైన చెరుకూరి గండయ్య మరణించిన విషయం గడుసు ప్రవీణ్ కుమార్ ద్వారా తెలుసుకున్న బీఎస్పీ నాయకులు ఆ కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం చేసి ఆ కుటుంబానికి మనో ధైర్యాన్ని ఇచ్చారు. మనువాద రాజకీయ పార్టీల తాయిలాలకు ఆశపడకుండా, మహానియులు చూపిన మార్గాన్ని ఎంచుకుని, నీలి జెండా కప్పుకుని తనవంతు సమాజానికి అంబేద్కర్ ఆశయాలను పరిచయం చెయ్యాలనే వ్యక్తికి బీఎస్పీ పార్టీ నాయకులు అండగా ఉన్న గ్యార మల్లేష్, యంజాల ప్రహ్లాద్, మెతరీ కుమార్, శీలం అంగద్, చిత్రం కృష్ణ, వద్దిగల్ల బాబు, భూతం రమణ, యడవల్లి శ్యామ్, జోగు స్వామి, ఏర్పుల రవి, అల్వాల జానీ, పచ్చల జంగయ్య, కొండ్రు కరుణాకర్, పంతంగి జగన్, గట్టు నర్సింహా, సంధన శ్రీహరి, రసూల్ గార్లకు* ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ట

*** ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న కోరం కుటుంబ సభ్యులు**



ప్రజాస్ఫూర్తి ఇల్లందు: ఇల్లందు నియోజకవర్గం,టేకులపల్లి మండలం,కోయగూడెం గ్రామం నందు ఘనంగా నిర్వహిస్తున్నటువంటి గ్రామ దేవతల (బొడ్రాయి,ధ్వజ స్థంభం,ఆంజనేయ స్వామి,ముత్యాలమ్మ,) విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ప్రారంభం సందర్భంగా నేడు గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే గౌ శ్రీ కోరం కనకయ్య _ లక్ష్మీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీ కోరం సురేందర్ _ ఉమా దంపతులు పాల్గొని వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## ఇష్టంగా చదివినట్లయితే బంగారు భవిష్యత్తును రూపొందించుకోవచ్చు

*** బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజా స్ఫూర్తి ) : విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదివినట్లయితే బంగారు భవిష్యత్తును రూపొందించుకోవచ్చునని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం చింతల్ లోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పదవ తరగతి విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఇటీవల పదవ తరగతి ఫలితాల్లో సత్తచాటిన ఐడిపిఎల్ పట్వారీ ఎంక్లేవ్ కి చెందిన “నవ జ్యోతి హై స్కూల్” విద్యార్థులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన బాణావతు సింధు భాయ్ (584/600), అమీరెడ్డి కార్తీక్ రెడ్డి (584/600) లతో పాటు 120 మంది విద్యార్థులు, విద్యార్థినులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పాఠశాల యాజమాన్యం నగదు ప్రోత్సాహక అందజేయగా, ఎమ్మెల్యే విద్యార్థిని, విద్యార్థులకు వారికి నగదు ప్రోత్సాహకం అందజేసి ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన నవజ్యోతి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యానికి ముందుగా శుభాకాంక్షలు తెలిపారు.పదవ తరగతి విద్య అనేది విద్యార్థులకు అత్యంత కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , కరస్పాండెంట్ ఎం. ఇందిరా రెడ్డి, డైరెక్టర్ ఆదిత్య కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రామ్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను సర్వతో ముఖాభివృద్ధిగా అభివృద్ధి పరచాం

*** బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను సర్వతో ముఖాభివృద్ధిగా అభివృద్ధి పరచామని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మ నగర్ నందు రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సిసి రోడ్డు పనులను ఎమ్మెల్యే తో పాటు స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ లు పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. నేటి కాంక్రీట్ జంగల్ లో ఆడ్డుకోవడానికి సరైన వసతులు, సదుపాయాలు లేక పిల్లలు, పెద్దలు చాలా ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి గత ప్రభుత్వ హయాంలోని దాదాపు మూడు కోట్ల రూపాయల వ్యయంతో ఇండోర్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేసి ఇటీవల ప్రారంభోత్సవం నిర్వహించామన్నారు. కానీ కొందరు నాయకులు ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవంపై చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, నాయకులంటే అభివృద్ధి కారకులుగా ఉండాలి కానీ అభివృద్ధి నిరోధకులుగా ఉండొద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు హనుమంత్, జమేదార్ సంతోష్, బాబు గౌడ్, అజయ్, బ్రహ్మానంద చారి,పాపిరెడ్డి, వివేక్, మల్లేష్ గౌడ్, దాసు, ప్రభాకర్, బండ మహేందర్, నాని, గిరి, మైసమ్మ నగర్ బి బ్లాక్ అధ్యక్షుడు బసవప్ప గుప్తా, జనరల్ సెక్రెటరీ బండారి రవీందర్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ యాదవ్, బస్తీ వాసులు ఎల్ఐసి వెంకటేష్, శ్రీశైలం చారి, రమేష్ చారి, నాగార్జున్, ప్రేమ్ సాయి, సాయి కిరణ్, ఉపేందర్, కన్నయ్య, భాను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాలలో ఇంకుడు గుంత




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మండల సకల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ప్రత్యేక సమావేశం శుక్రవారం మండల రిసోర్స్ కేంద్రంలో నిర్వహించబడింది. మండలం ఈసారి పదవ తరగతి పరీక్షలకు 783 మంది విద్యార్థులు హాజరుకాగా 693 మంది ఉత్తీర్ణత సాధించడంలో 89% ఉత్తమ ఫలితాలను నమోదు చేసినందున హెచ్ఎం , ఉపాధ్యాయ బృందం నకు ఎంఈఓ డాక్టర్ ఎం ప్రభుదయాల్ అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రతి పాఠశాలలో ఇంకుడు గుంత ఈ నెల 10లోపు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. వర్షపు నీరు వృధా కాకుండా భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కనుక విధిగ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని సూచించారు. మండలంలో గల సకల ప్రభుత్వ పాఠశాలలకు గత నెల పదవ తేదీ ఏకరూప దుస్తుల క్లాత్ వచ్చిన వెంటనే స్వయం సహాయక బృందాలకు ఇచ్చినట్లు, అట్టి కుట్టు పనిలో పరిస్థితులను గమనించారన్నారు. 5వ తేదీ సోమవారం నుండి ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటల నుండి 11 వరకు సమ్మర్ క్యాంప్ లు నిర్వహించనున్న మేర అందరూ విద్యార్థులు హాజరగునట్లు చూడాలన్నారు. పాఠశాలలో నమోదు పెంచేలా తగు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. వృక్ష సంపద పెంపునకు జిల్లా కలెక్టర్ సూచించిన అంశాలను పాటించాలన్నారు. ఈ ప్రత్యేక సమావేశంలో హెచ్ఎంలు, సిఆర్పిలు , ఎంఆర్పి , సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణా ప్రభుత్వ మాజీ విప్ ఎం.యస్. ప్రభాకర్ రావు కు జన్మదిన శుభాకాంక్షలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణా ప్రభుత్వ మాజీ విప్ ఎం.యస్. ప్రభాకర్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కూకట్పల్లి నియోజకవర్గం ఐ.యన్.టి.యు. సి అధ్యక్షులు, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు ఎం.యస్. ప్రభాకర్ రావు నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి పూల బోకె అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కూతడి కృష్ణా, జాయింట్ సెక్రటరీ నాగార్జున, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకి ప్రత్యేక కృతజ్ఞతలు



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : తెలంగాణ ప్రభుత్వం బీసీ లకు రాజకీయ, విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ఉభయ సభల్లో చేసిన బిల్లుకు ఏప్రిల్ 8 న గవర్నర్ ఆమోదం పొంది రాష్ట్రపతికి పంపడంతో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కి టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు,తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలు.ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కమలాకర్ కు యంగ్ ఇండియన్ సేవా పురస్కారం 2025 అవార్డు ప్రధానం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: హైదరాబాద్ నాంపల్లి మదీనా పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో గురువారం రాత్రి యంగ్ ఇండియన్ సేవా పురస్కారం 2025 అవార్డ్ ల ప్రధానోత్సవం నేషనల్ వైస్ గా మన బాలన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి కే. అశోక్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ అవార్డ్స్ ప్రధానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం హనుమాన్ జిమ్ బ్లడ్ ఫౌండర్ కామ కమలాకర్ చేస్తున్న సేవల్ని గుర్తించి యంగ్ ఇండియన్ సేవా పురస్కారం 2025 అవార్డు కే అశోక్ రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం సంతోషంగా ఉంది మన హనుమాన్ జిమ్ బ్లడ్ ఫౌండేషన్ కి అవార్డు దక్కడం దీనికి సహకరించిన నా మిత్రులు అయినటువంటి బ్లడ్ డోనర్స్ కి కృతజ్ఞతలు నాతోపాటు నా మిత్రుడు అయినటువంటి జుబ్బా , రాజేష్ కి ఈ అవార్డ్స్ రావడం సంతోషకరమైన విషయం మన ఫౌండేషన్ సేవల్ని గుర్తించి నాకు అవార్డు ఇచ్చిన బాలన్న కి పుల్లయ్య కి ( బ్రేక్ ఇన్ స్పెక్టర్ ) కృతజ్ఞతలు తెలిపారు.

# బాల్యంలో శిక్షణ, యుక్త వయసులో క్రమశిక్షణ

* **వృద్ధాప్యంలో మీ జీవితానికి రక్షణ గా నిలుస్తాయి**
* **టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి. కోటి రెడ్డి**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : బాల్యంలో శిక్షణ, యుక్త వయసులో క్రమశిక్షణ , వృద్ధాప్యంలో మీ జీవితానికి రక్షణ " గా నిలుస్తాయని టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి. కోటి రెడ్డి అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని అపురూప కాలనీ లో గల టీవిఆర్ మోడల్ హై స్కూల్లో టీవిఆర్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో పదవ తరగతిలో టాపర్గా నిలిచిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 67 మంది విద్యార్థిని విద్యార్థులు 500 నుండి 586 మార్కులు సాధించగా అందులో 26 మంది విద్యార్థినీ విద్యార్థులు 550 నుండి 586 మార్కులు సాధించి స్కూల్ టాపర్స్ గా నిలిచిన విద్యార్థిని విద్యార్థులను టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టీ. కోటి రెడ్డి పుష్పగుచ్చాల తో సత్కరించి విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దృఢ సంకల్పం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ తో పటిష్ట ప్రణాళికతో ఆచరించి ముందుకు సాగితే జీవిత ఆశయాన్ని సాధించి ఉన్నత శిఖరాలను చేరుతారని హితవు పలికారు. నేటి నుండి ప్రతిక్షణం అతి ముఖ్యమైనదని సమయం వృధా కాకుండా ఇంకా 5 సంవత్సరాలు కష్టపడి చదివితే జీవితాంతం సుఖపడతారన్నారు. జీవిత దిశ నిర్దేశాలు సూచనలు తెలుపుతూ మీకు జీవితంలో ఉన్నతమైన భవిష్యత్తు లభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ




కాప్రా , ప్రజాస్ఫూర్తి : కుషాయిగూడ డిపో ఎదుట బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, కుషాయిగూడ డిపో మేనేజర్ మహేష్ కుమార్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజన్న పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు.విగ్రహాన్ని విరాళంగా అందించిన చుక్కాపురం నర్సింగ్ రావు, చినింగని ఆనంద్ రావు మాట్లాడుతూ తమకు ఈ అవకాశాన్ని కల్పించడంపై ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లూరి అంజన్న మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కాలంలో కుషాయిగూడ డిపో కార్మికులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. మహనీయుల విగ్రహాల ద్వారా వారి ఆశయాలను గుర్తుచేసుకోవడం స్ఫూర్తిదాయకమని తెలిపారు.రాజ్యాధికారానికి బహుజనులు ఐక్యంగా పోరాడే సమయం ఆసన్నమైంది అని ఆయన వ్యాఖ్యానించారు. డా.బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాల తర్వాత ఇప్పుడు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు.ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం శ్రమించిన బాబు జగ్జీవన్ రామ్ సేవలను గుర్తు చేశారు.మహనీయులు మరణించరు. వారు తమ ఆశయాలతో మన మధ్యనే ఉన్నారు. వారి స్ఫూర్తితో పనిచేయాలి అని ప్రీతం తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ స్టేట్ ప్రెసిడెంట్ వల్లూరి బాబు, స్టేట్ జనరల్ సెక్రటరీ దుబ్బాక యాదయ్య, డిపో ప్రెసిడెంట్ చక్రం మోహన్, సెక్రటరీ పండరి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కౌశల్య, బి.నర్సింగరావు, చుక్కాపురం దాసుజంగయ్య, ఆనంద్, సత్యనారాయణ, సుగుణాకర్, రామకృష్ణ, లీలా రావు, తిరుపతి, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ ఎస్టీ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## అందుకే కిషన్ రెడ్డి షాక్‌లో ఉన్నారు

**: జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**

* **బీజేపీ అధ్యక్షుడిగా ఫెయిల్ అయ్యాననే భావన ఆయనలో ఉందని వ్యాఖ్య**
* **కిషన్ రెడ్డికి అధిష్ఠానం నుంచి మొట్టికాయలు పడి ఉంటాయన్న జగ్గారెడ్డి**

కులగణనపై కిషన్ రెడ్డి తప్పుడు ప్రకటన చేశారని విమర్శ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రస్తుతం షాక్‌లో ఉన్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఆయన విఫలమయ్యారనే భావనలో ఉండడం వల్లనే ఆందోళన చెందుతున్నారని విమర్శించారు. ఆయనకు తన పార్టీ అధిష్ఠానం నుంచి మొట్టికాయలు పడి ఉంటాయని అభిప్రాయపడ్డారు. 'మీరు తెలంగాణలో ఏం చేస్తున్నారు?' అని అధిష్ఠానం ప్రశ్నించి ఉంటుందని వ్యాఖ్యానించారు. కిషన్ రెడ్డి సాధారణంగా వివాదాస్పద అంశాలకు దూరంగా ఉంటారని, కానీ ఈ మధ్య తరచూ ప్రకటనలు చేస్తూ ఉండటం గమనించామన్నారు. కేంద్ర మంత్రిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయనపై ఢిల్లీ పెద్దల ఒత్తిడి ఉండవచ్చని పేర్కొన్నారు. బీసీ కులగణనలో తప్పులున్నాయని కిషన్ రెడ్డి చేసిన ప్రకటనను జగ్గారెడ్డి తప్పుబట్టారు. కులగణన పక్కాగా జరిగిందని ఆయన స్పష్టం చేశారు. సర్వే జరిగిన నెల రోజులు కిషన్ రెడ్డి ఢిల్లీలో ఉండి, ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నీట్ (యు జి)2025 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు జరగనున్న నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం తెలిపారు. జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాలయిన కొత్తగూడెంలోని సింగరేణి ఉమేన్స్ కళాశాల,పాల్వంచ లోని టిజిఎస్ డబ్ల్యూ ఆర్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ (గర్ల్స్) యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (కె.ఎస్.ఎం) వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించబోయే అధికారులతో ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పలు సూచనలను చేశారు. అభ్యర్థులంతా అడ్మిట్ కార్డు నందు సూచించబడిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడుతుందన్నారు.పరీక్ష సమయం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రానికి హాజరయ్యే అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను గానీ,ఆభరణాలను గానీ, షూస్,సాక్స్,బెల్ట్ లు (ఉదా: చెవి దిద్దులు,క్లిప్పులు,రింగులు, మెట్టెలు,చైన్లు, ఇతర ఆభరణాలు, తాళ్ళు,తాయేత్తులు) బ్యాగులు లాంటివి అనుమతించబడవన్నారు. ఇలాంటివి ఏమీ లేకుండా అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని సూచించడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రం ప్రవేశద్వారం వద్ద పురుషులను,స్త్రీలను వేరు వేరుగా క్షుణ్ణంగా తనిఖీ చేస్తారన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో పాటు, గుర్తింపు కార్డు , రెండు పాస్ ఫోటోలు, ఒక పోస్ట్ కార్డు సైజు ఫోటోను తమ వెంట తప్పనిసరిగా తీసుకొని రావలన్నారు. పరీక్షా కేంద్రాలు పూర్తిగా సీసీ కెమెరాల



నిఘాలో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాల నుండి 200 మీటర్ల దూరంలో ఎవరూ ఉండరాదన్నారు. పరీక్ష రోజున పరీక్షా కేంద్రాలకి దగ్గరలో ఉన్న జిరాక్స్ సెంటర్లు,కంప్యూటర్ సెంటర్లు మూసివేయబడుతాయన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ప్రతి ఒక్కరిని ముందుగానే బయోమెట్రిక్ ద్వారా చెక్ చేసి,పరీక్ష రాసే సమయంలో వీడియోగ్రఫీ చేయబడుతుందన్నారు. పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులకు మంచినీటి సౌకర్యం , అత్యవసర వైద్య సేవలకు గాను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాలలో హాజరు కానున్న అభ్యర్థుల కొరకు కొత్తగూడెం బస్టాండు,రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లలో,బస్సులు ఆగు స్థలాలలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనుటకై క్యూఆర్ కోడ్ ను అంటించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్ష రాయడానికి ఎలాంటి పెన్నులు,పెన్సిల్స్ తీసుకురావద్దన్నారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు ప్రతి ఒక్కరికి బ్లాక్ బాల్ పెన్ ఇస్తారు. పరీక్షకు హాజరయ్య అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లకు సంబంధించిన ఫోన్లు,ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను కూడా పరీక్షా కేంద్రంలోకి అను మతించబడుతాయన్నారు.

## కులగణన సర్వేలో నాన్న, అన్నలు ఎందుకు పాల్గొనలేదు

* **తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



ప్రజాస్ఫూర్తి , హైదరాబాద్ : సామాజిక తెలంగాణ కోసం కులగణన చేస్తుంటే మీ నాన్న, అన్న ఎందుకు సర్వేలో పాల్గొనలేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్ లోని సిఎల్పీ మీడియా పాయింట్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత కు తెలంగాణ రాష్ట్రం పైన ఇప్పటికైనా సోయి వచ్చింది...కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా కవిత నిజాలు మాట్లాడారు..సామాజిక తెలంగాణ ఇంకా రాలేదని కవిత వ్యాఖ్యానించింది..రాష్ట్ర తలసరి ఆదాయం కవితకు ఇప్పుడు గుర్తుకు వచ్చింది...10 ఏళ్ల లో తన తండ్రి కేసీఆర్ చేసిన తప్పులు, అప్పులు ను కవిత ఏ నాడు ఎత్తి చూపించలేదు...10 ఏళ్లు రైతు బంధు పైన కవిత మాట్లాడలేదు...నిజమైన రైతులకు రైతు బంధు అందడం లేదని ప్రతిపక్షంగా ఆ నాడు కాంగ్రెస్ మొత్తుకుంది.భూమి లేని వారికి సాయం చేయాలని మేం ఆ నాడు అడిగితే పట్టించుకోలేదు... మా ప్రభుత్వం భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సాయం అందిస్తోందన్నారు. పందికొక్కుల్లా పది ఏళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకున్నారు.. అప్పుడు కవిత కు సోయి రాలేదన్నారు. ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రులు అన్ని మీ సామాజిక వర్గం దగ్గర ఉన్నప్పుడు కవితకు సామాజిక న్యాయం గుర్తుకు రాలేదా..? ..? 10 ఏళ్లలో కార్మికులకు కవిత ఎందుకు అండగా నిలబడలేదు..? ఆర్టీసీ కార్మికులు 50 రోజులు సమ్మె చేసి 30 మంది చనిపోతే ఎందుకు కవిత ఆ నాడు స్పందించలేదు..? కల్వకుంట్ల కుటుంబంలో తగాదాలు వచ్చి తన ప్రాధాన్యం తగ్గిపోవడం వల్లనే కవిత ఇప్పుడు మాట్లాడుతోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడే కేసీఆర్ ను కవిత ప్రశ్నిస్తే రాష్ట్రం ఇంకోలా ఉండేది...ఇప్పటికైనా కవిత కళ్లు తెరిచి మాట్లాడుతున్నందుకు సంతోషం గా ఉందన్నారు. .కేసీఆర్ హయాంలోని తప్పులను ఇంకా బయటపెట్టి కవిత తెలంగాణ ప్రజల రుణం తీర్చుకోవాలన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కులగణన పైన సోయి లేకుండా మాట్లాడుతున్నాడు..కాంగ్రెస్ గురించి తన స్థాయి ని తగ్గించుకుని కిషన్ రెడ్డి మాట్లాడుతున్నాడు. కులగణన చేయాలని ప్రధాని మోదీ నిర్ణయించడంతో తెలంగాణ బీజేపీ నేతలకు దిమ్మతిరిగిపోయిందన్నారు. .రేవంత్ రెడ్డిని ప్రధాని మోదీ హీరో చేశారు.. అందుకే బీజేపీ నేతలు బాధపడుతున్నారన్నారు. కులగణన తో దేశంలోనే రేవంత్ రెడ్డి హీరోలా నిలబడటాన్ని బీజేపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. బీసీ బిల్లు ను గవర్నర్ ఆమోదించి రాష్ట్రపతికి పంపడం మా తొలి విజయమన్నారు.

# బీసీల న్యాయమైన పోరాటం తో బిసిల కల సాకారం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కేంద్ర కేబినెట్ నిర్ణయంతో బీసీల న్యాయమైన పోరాటం తో బిసిల కల సాకారం కాబోతుందని బీసీ మహసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కుల గణన నిర్ణయంపై బీసీ మహా సభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడికి, కేంద్ర కేబినెట్ మంత్రులకు , సీఎం రేవంత్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సబ్బండ వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని గ్రహించి వారిలో చైతన్యం తెవాలనే దృఢ సంకల్పంతో బీసి కులాలన్నింటిని ఏకం చేసి ఉద్యమాన్ని నడిపిన ఘనత వారికి చెందుతుందన్నారు. నేడు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల అభ్యున్నతి కి ముందడుగు వేస్తున్నాయని అభిప్రాయ పడ్డారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా కుల గణన చేపట్టి వనరుల్లో , సంపదలో, రాజకీయ అవకాశాల్లో , ఉద్యోగ ఉపాధి రంగాలలో బీసీ వర్గాలకు న్యాయపరమైన వాటా పంచాలని కేంద్రాన్ని కోరారు. రిజర్వేషన్లు సక్రమంగా అమలు కావాలంటే ఏ కులం వారు ఎందరు ఉన్నారన్న లెక్కలు ప్రభుత్వాలు ముందుగా తేల్చాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఒక్క కుల గణన చేయడమే కాదు. చట్ట సభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ బద్ధ హక్కులను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జనాభా దామాషా పద్ధతిలో సమానంగా దక్కేలా చూడాలన్నారు,. ఇప్పటికైనా కేంద్రం బీసీల న్యాయమైన డిమాండ్ ను గౌరవించి జనాభా లెక్కలు తీయాలని నిర్ణయం తీసుకోవడం దేశంలోనే ఓ చారిత్రత్మక ఘటమన్నారు. అధికారిక లెక్కలు లేకపోవడంతో అనాదిగా బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. బీసీ జనగణన జరిగితేనే సంక్షేమ ఫలాలు బీసీలకు అందుతాయని , అప్పుడేబీసీలకు ఆర్థిక పురోగతి సాధ్యమన్నారు.

## వియత్నాంకు చేరిన బుద్ధుని పవిత్ర అవశేషాలు



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : ఐక్యరాజ్యసమితి వేసక్ దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రజల దర్శనం, ఆరాధన కోసం బుద్ధుని పవిత్ర అవశేషాలు వియత్నాంకు చేరుకున్నాయి. మొదట ఉత్తరప్రదేశ్లోని సారనాథ్ ని ఒక విహారంలో ప్రతిష్టించబడిన ఈ అవశేషాలను గురువారం ప్రత్యేక భారత వైమానిక దళ విమానంలో వియత్నాంకు తరలించారు. ఈ ప్రదర్శన మే 2 నుండి మే 21, 2025 వరకు జరుగుతుంది. అవశేషాలను వెంబడించిన భారత ప్రతినిధి బృందానికి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు మరియు మైనారిటీ వ్యవహారాల మంత్రి శ్రీ కిరెన్ రిజిజు నాయకత్వం వహించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సంస్కృతి, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, అనేక మంది అధికారులు ఉన్నారు. చేరుకున్న తర్వాత, ప్రతినిధి బృందం, పవిత్ర అవశేషాలకు గొప్ప గౌరవప్రదమైన స్వాగతం లభించింది.మంత్రి రిజిజు సోషల్ మీడియాలో తన ఆలోచనలను పంచుకుంటూ, "బుద్ధుని పవిత్ర అవశేషాలను వియత్నాంకు తీసుకువెళుతున్న ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించడం వినయంగా ఉందన్నారు. ఇది ఆత్మను తాకే అనుభవం" అని పేర్కొన్నారు. "శాంతి, కరుణ, సామరస్యంతో కూడిన ఈ పవిత్ర ప్రయాణంలో సన్యాసులు, కందుల దుర్గేష్ అధికారులు చేరారని అని ఆయన అన్నారు.

## ఘనంగా బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ సమావేశం



శేర్లింగంపల్లి: ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్ గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) ఆధ్వర్యంలో బీఎన్ఐ జాగ్వార్ పేరుతో ఒక ప్రత్యేక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌లోని పలు ప్రముఖ కంపెనీల సీఈఓలు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజన షా మాట్లాడుతూ ఎటువంటి వ్యాపారం చేయాలనుకుంటున్న వారికైనా తమ వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి బీఎన్ఐ వేదిక ఎటువంటి ఛార్జీలు లేకుండా సహాయం చేస్తుందని తెలిపారు. బీఎన్ఐ యొక్క విశిష్టమైన ప్లాట్‌ఫామ్ ద్వారా వ్యాపార యజమానులు ఒకరికొకరు సహకరించుకుంటూ, కొత్త వ్యాపార అవకాశాలను పొందవచ్చని ఆమె వివరించారు.అనంతరం బీఎన్ఐ ఏరియా డైరెక్టర్ సతీష్ మాట్లాడుతూ బీఎన్ఐ యొక్క అతిపెద్ద చాప్టర్‌గా జాగ్వార్‌ను ఈరోజు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నగరంలో చిరు వ్యాపారులు మరియు కొత్తగా వ్యాపారం చేసుకునే వారికి ఈ వేదిక ఎంతగానో దోహదపడుతుందని ఆయన తెలిపారు.ప్రపంచంలోనే అతిపెద్ద బిజినెస్ రెఫరల్ ప్లాట్‌ఫామ్‌గా బీఎన్ఐ అన్ని రంగాల్లోని వ్యాపారాలు అభివృద్ధి చెందడానికి ఉత్తమమైన వేదిక అని ఆయన పేర్కొన్నారు. వ్యాపారంలో రాణించాలనుకునే వారికి బీఎన్ఐ ఒక బలమైన పునాదిని అందిస్తుందని ఆయన నొక్కి చెప్పారు.ఈ సమావేశం నగరంలోని వ్యాపార వర్గాల్లో ఒక నూతన ఉత్సాహాన్ని నింపింది. బీఎన్ఐ జాగ్వార్ చాప్టర్ రాబోయే రోజుల్లో వ్యాపారాల వృద్ధికి ఒక ముఖ్యమైన కేంద్రంగా మారే అవకాశం ఉందని తెలిపారు.

## ఉదయ్ భానును కలిసిన ఇల్లెందు యూత్ లీడర్ సుమిత్ కోరి



ప్రజాస్ఫూర్తి ఇల్లందు : పార్టీ కోసం పని చేసిన వారిని గుర్తించి వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు మేలు జరుగుతుందని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరికి ఏ విధమైన ఇబ్బంది ఉన్న సహాయం అందిస్తా అని తెలిపారు.

# 70 లక్షల మొక్కలు నాటడమే వన మహోత్సవ లక్ష్యం

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: 2025 26 వన మహోత్సవంలో భాగంగా 70 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. శుక్రవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరంలో అన్ని శాఖల అధికారులతో వనమహోత్సవం పై ఐటీడీఏ పీవో రాహుల్ , అటవీశాఖాధికారి కృష్ణ గౌడ్ తో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంచాలని లక్ష్యంతో ప్రభుత్వం ఏటా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతుందని, దీనిలో భాగంగా అన్ని శాఖలకు లక్ష్యాలను నిర్దేశించారు. ఈ ఏడాది వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా రైతులకు, ఇంటి ఆవరణ, రహదారుల వెంట, కెనాల్ బండ్ ప్లాంటేషన్ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అత్యధికంగా జిల్లా గ్రామీణ



అభివృద్ధి శాఖకు 30 లక్షల మొక్కలు, టీ జి ఎఫ్ డి సి శాఖకు 12 లక్షల మొక్కలు, అటవీశాఖ 10 లక్షలు, సింగరేణి 10 లక్షలు, ఉద్యానవన శాఖ 5.7 లక్షలు, వ్యవసాయ శాఖ 5 లక్షలు, ఇరిగేషన్ 2 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యాలను నిర్దేశించారు. వన మహోత్సవంలో భాగంగా నాటే మొక్కలు ఎక్సైజ్ శాఖ అధికారులు తాటి , ఈత చెట్లను నాటాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మునగ మొక్కలు, అటవీశాఖ వెదురు మొక్కలు, విద్యాశాఖ అధికారులు అన్ని పాఠశాలల్లో ఔషధ మొక్కలు అయినటువంటి తులసి, కరివేపాకు, ఉసిరి, మునగ , వెలగ మొక్కలను నాటాలన్నారు. ఇరిగేషన్ అధికారులు జిల్లావ్యాప్తంగా ఉన్న కెనాల్ బండ్ ప్లాంటేషన్ లో సుబాబులు , వట్టివేర్లు మొక్కలు నాటాలన్నారు. ఆసక్తి గల రైతులకు అటవీ శాఖ నర్సరీలలో టేకు, ఎర్రచందనం , వెదురు మొక్కలు అందుబాటులో ఉన్నాయని అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు వారికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించటానికి ఖచ్చితమైన ప్రణాళికను రూపొందించుకోవాలని, వారికి కావలసిన మొక్కలను గ్రామీణ అభివృద్ధి సంస్థ నర్సరీ నుండి తీసుకోవాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తింపు, గుంతల త్రవ్వకం చేపట్టాలన్నారు. మొక్కలు నాటడం తో పాటు మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కిషోర్, ఇరిగేషన్ ఈ ఈ అర్జునరావు, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి తిరుపతయ్య, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'నా పక్కన శశి థరూర్.. వాళ్లకు నిద్రపట్టదేమో': మోదీ వ్యంగ్యాస్త్రాలు

తిరువనంతపురం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం కేరళలో పర్యటించారు. తిరువనంతపురం సమీపంలో రూ.8,900 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన విఝింజమ్ ఇంటర్నేషనల్ డీప్‌వాటర్ మల్టీపర్పస్ సీపోర్టును ప్రధాని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తిరువనంతపురం ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ హాజరయ్యారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. ప్రతిపక్ష పార్టీపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఈ ఫొటో చూసి కొందరికి నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు. ''ఈ రోజు శశిథరూర్ ఇక్కడ ఉన్నారు. ఈ ప్రోగ్రామ్ కొంతమందికి నిద్ర లేని రాత్రిని మిగులుస్తుంది. ఈ సందేశం ఎక్కడికి వెళ్లాలో అక్కడికి వెళ్లిపోయింది'' అని మోదీ పరోక్షంగా కాంగ్రెస్‌ను చమత్కరించారు. కాగా.. గురువారం రాత్రి కేరళ చేరుకున్న ప్రధానిని థరూర్ వ్యక్తిగతంగా వెళ్లి స్వాగతించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. ''ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల ఆలస్యం ఉన్నప్పటికీ.. సమయానికి తిరువనంతపురం చేరుకోగలిగా. నా నియోజకవర్గానికి వచ్చిన మోదీని సాదరంగా స్వాగతించా'' అని థరూర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ అధినాయకత్వంతో శశిథరూర్ బంధం బీటలు వారుతున్నట్లు ఊహాగానాలు



వినిపిస్తున్న సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా థరూర్ తన సొంత పార్టీపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆ మధ్య ఓ కేంద్ర మంత్రితో ఆయన సెల్ఫీ దిగడంతో థరూర్ పార్టీ మారనున్నట్లు ప్రచారం మొదలైంది. ఇక, భారత విదేశాంగ విధానాన్ని ప్రశంసిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ పరిణామాల వేళ ఆయన మోదీతో వేదిక పంచుకోవడం చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ సీపోర్ట్‌తో కేరళలో ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యం, షిప్పింగ్‌లో భారత పాత్రను గణనీయంగా మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 453 కేజీల భారీ బాంబు గుర్తింపు.. నిర్వీర్యం చేసిన ఆర్మీ

453 కేజీల భారీ బాంబును ఆర్మీ సిబ్బంది నిర్వీర్యం చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మహారాష్ట్రలోని వర్వాండి గ్రామంలోని తన భూమిలో భారీ పేలుడు పదార్థం ఉన్నట్లు రాజేంద్ర ధాగే అనే రైతు మార్చి 28న స్థానిక రెవెన్యూ అధికారి జ్ఞానదేవ్ బెల్హేకర్‌కు సమాచారం ఇచ్చాడు. పొలంలో ఆరడుగుల భూమి లోపల ఏర్పాటుచేసుకున్న పైపులు పగిలిపోవడంతో వాటిని మరమ్మతు చేయడానికి భూమిని తవ్వగా.. బాంబు పిన్ కనిపించిందని అతడు పేర్కొన్నాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి వచ్చి వివిధ పరీక్షలు జరిపారు. భూమిలో భారీ పేలుడు పదార్థం ఉన్నట్లు గుర్తించారు. అది పేలే అవకాశం ఉన్నందున ప్రజలను ఆ ప్రాంతం నుంచి తరలించారు. దీనిని వెలికితీయడానికి అనుమతి కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన అనంతరం పుణెలోని 10మంది వైమానిక, ఆర్మీ దళ అధికారులు వర్వాండికి చేరుకున్నారు. నెల రోజుల పాటు శ్రమించి జేసీబీ సహాయంతో బాంబు చుట్టూ ఏడడుగుల గొయ్యి తవ్వి.. బాంబు స్క్వాడ్ బృందాల సహాయంతో తొలుత దానిని నిర్వీర్యం



చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అది నాలుగున్నర అడుగుల పొడవు, నాలుగు అడుగుల వ్యాసం, 453 కిలోల బరువున్నట్లు తెలిపారు. అనంతరం దానిని ఓ ప్రత్యేక వాహనంలో అహల్యానగర్‌లోని కెకె రేంజ్‌కు తరలించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడినట్లు అధికారులు వెల్లడించారు. బాంబును తరలించే సమయంలో ఆ మార్గంలో అరగంట పాటు వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు అధికారులు పేర్కొన్నారు. బాంబు పేలిఉంటే కిలోమీటరు మేర ఉన్న ఇళ్ళు పూర్తిగా ధ్వంసమై ఉండేవని.. భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించేదని అధికారులు పేర్కొన్నారు. భూమిలో భారీగా ప్రకంపనలు సంభవించేవని తెలిపారు. పెద్ద ప్రమాదాన్ని తప్పించినందుకు రైతును అభినందించారు. బాంబు అక్కడికి ఎలా వచ్చింది అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## భారత్‌లో.. పాక్ ప్రధాని యూట్యూబ్ ఛానల్ నిలిపివేత!

పహల్గాం ఉగ్రదాడితో భారత్‌పాక్ సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆ ఘటన తర్వాత భారత ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ యూట్యూబ్ ఛానల్ స్ట్రీమింగ్‌ను మనదేశంలో నిలిపివేసింది. జాతీయ భద్రతకు సంబంధించి భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కంటెంట్ ప్రస్తుతం ఈ దేశంలో అందుబాటులో లేదని ఆ ఛానల్ క్లిక్ చేసిన వారికి ఒక సందేశం దర్శనమిస్తోంది. ఈ ఉద్రిక్తతలు భగ్గుమంటోన్న వేళ.. పాకిస్థాన్ కేంద్రంగా నిర్వహిస్తున్న పలు యూట్యూబ్ ఛానళ్ల ప్రసారాలు, సామాజిక మాధ్యమ ఖాతాలను భారత్‌లో నిలిపివేస్తూ కేంద్రం నిర్ణయం



తీసుకున్న సంగతి తెలిసిందే. పాక్ న్యూస్, ఎంటర్‌టైన్‌మెంట్ మీడియాకు చెందిన పలు ఛానళ్లపై వేటు పడింది. పాక్ మాజీ ఆటగాళ్లు షోయబ్ అక్తర్, బాసిత్ అలీ, షాహిద్ అఫ్రిది ఛానళ్లు కూడా అందులో ఉన్నాయి. ఆ దేశ రక్షణ మంత్రి ఎక్స్ ఖాతాను బ్లాక్ చేసింది. పాకిస్థాన్ క్రికెటర్స్ బాబర్ అజామ్, మహ్మద్ రిజ్వాన్, షహీన్ అఫ్రిదీ ఇన్‌స్టా ఖాతాలను తాజాగా సస్పెండ్ అయ్యాయి. పాకిస్థాన్ జావెలియన్ త్రోయర్, ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను ఇప్పటికే బ్లాక్ చేసిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత చట్టపరమైన చర్యల్లో భాగంగా భారత్‌లో అతని ఖాతాను నిలిపివేశారు. ''భారత్‌లో నదీమ్ ఖాతా అందుబాటులో లేదు. ఖాతాలోని సమాచారాన్ని నియంత్రించాలన్న చట్టపరమైన అభ్యర్థనను పాటిస్తున్నాం'' అని భారత్‌లో నదీమ్ ఇన్‌స్టా ఖాతా తెరిచిన వాళ్లకు ఈ సందేశం కనిపిస్తోంది.

## సోనియా, రాహుల్ గాంధీలకు ఢిల్లీకోర్టు నోటీసులు

ఢిల్లీ: నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ కోర్టు నోటీసులు జారీ చేసింది. ఛార్జిషీట్ పై న్యాయబద్ధమైన విచారణ జరిగే సమయంలో ఎప్పుడైనా అవతలి పక్షంవారు తమ వాదనలు వినిపించే హక్కు ఉంటుందని ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ విశాల్ గోగ్నే అన్నారు. దీనిపై తదుపరి విచారణను మే 8కి వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త చట్ట నిబంధనల ప్రకారం నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో నిందితులను విచారించకుండా ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోలేమని.. కాబట్టి విచారణకు హాజరయ్యేలా వారికి నోటీసులు ఇవ్వాలని ఈడీ ఇటీవల ఢిల్లీ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.



గతవారం ఈ కేసును విచారించిన న్యాయస్థానం ఈడీ సమర్పించిన ఛార్జిషీట్‌లో సరైన పత్రాలు లేని కారణంగా రాహుల్, సోనియా గాంధీలకు నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించింది. తాజాగా దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ చర్యలు తీసుకుంది. 'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఇటీవల ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఆస్తులున్న ప్రాంతాల్లో (ఢిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించింది. కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే పేర్లతో ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లెయింట్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు విచారణ చేపట్టింది.

## ఐఎస్ఎస్‌కు వెళ్లనున్న, శుభాంశు శుక్లా కాల్‌సైన్ ఇదే..

భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసియాత్ర ప్రయాణ తేదీ ఖరారైంది. యాక్సియం 4 (ఏఎక్స్ 4) మిషన్‌లో భాగంగా మే 29న ఆయన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) పయనం కానున్నారు. ఈ యాత్రలో శుక్లాతోపాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ) కూడా పాలుపంచుకుంటారు. ఈ అంతరిక్ష యాత్రలో శుక్లాకు 'Shukx' అనే కాల్‌సైన్ కేటాయించినట్లు నాసా వర్గాలు వెల్లడించాయి. కాల్‌సైన్ అంటే వ్యోమగాములకు పెట్టే ఒక కోడ్ నేమ్. అంతరిక్షానికి వెళ్లే అంతర్జాతీయ వ్యోమగాములు తోటివారిని ఈ కాల్‌సైన్స్‌తోనే పిలుచుకుంటారు. సాధారణంగా ఇటువంటి కోడ్‌లను సైనిక విమానయాన శాఖలు ఉపయో



గిస్తుంటాయి. శత్రు దేశాలకు మన పైలట్ల వివరాలు, వారు ఎవరితో మాట్లాడుతున్నారనే విషయాలు తెలియకుండా ఉండడానికి వీటిని ఉపయోగిస్తారు. భారత కాలమానం ప్రకారం మే 29న రాత్రి 10.30 గంటలకు ఫ్లోరిడాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్ వ్యోమనౌకలో నలుగురు వ్యోమగాములు నింగిలోకి పయనమవుతారు. వ్యోమగాములు రెండు వారాలపాటు ఐఎస్ఎస్‌లో గడపనున్నారు. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా, భారత రోదసి పరిశోధన సంస్థ (ఇస్రో)లు సంయుక్తంగా ఈ మిషన్‌ను చేపడుతున్నాయి. ఇందులో భాగంగా శుభాంశు కనీసం ఏడు ప్రయోగాల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. అంతరిక్షంలో పంట సాగు, వాటర్స్ బేర్ (నీటి ఎలుగుబంటి) గురించి అధ్యయనం చేయనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భారతీయ ఆహారంతో ముడిపడిన పంటలపై ప్రయోగాలను చేపట్టడానికి ఇస్రో ప్రణాళికలు సిద్ధం చేసింది. మెంతి, పెసలు మొలకలపై పరిశీలన వంటివి ఇందులో ఉంటాయి. వాటిని భూమిపైకి తీసుకొచ్చి.. నేలపై ఎలా ఎదుగుతాయన్నది పరిశీలిస్తారు.

## తిరిగొచ్చే వారి కోసం.. అట్టారీవాఘా మళ్లీ తెరిచిన పాక్..!

భారత్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చే వారి కోసం పాకిస్థాన్ అట్టారీవాఘా సరిహద్దును శుక్రవారం మళ్లీ తెరిచింది. పహల్గాంలో దాడి తర్వాత పాక్‌పై దౌత్య చర్యల్లో భాగంగా ఆ దేశస్థులకు జారీ చేసిన స్వల్పకాలిక వీసాలను భారత్ రద్దు చేసిన విషయం తెలిసిందే. గతనెల 30వ తేదీ తర్వాత పాక్ ఈ సరిహద్దును పూర్తిగా మూసేసింది. అప్పటివరకు భారత్ నుంచి 911 మంది పాక్ జాతీయులు స్వదేశానికి వెళ్లారు. ఆతర్వాత దాదాపు 24 గంటలపాటు పాకిస్థాన్ నుంచి ఎటువంటి స్పందనా లేదు. దీంతో భారత్‌లో నిలిచిపోయినవారు తీవ్ర ఆందోళన చెందారు. తాజాగా ఆ సరిహద్దును తెరిచి.. తమ జాతీయులను వెనక్కి తీసుకొంటోంది.



# ట్రిప్‌కి ఏం వేద్దాం?

వేసవి అనగానే గుర్తొచ్చేది విహారాలే! ఎక్కడికి వెళ్లాలి అని ఎంచుకోవడం కష్టమేమీ కాదేమో కానీ... ఏం వేసుకోవాలి? ఏ దుస్తులు తీసుకెళ్లాలి అన్నదే మనకు ప్రధాన సమస్యగా కనిపిస్తుంది కదూ! అవును మరి... సౌకర్యంగా ఉండాలి, స్టైలిష్‌గానూ కనిపించాలంటే దుస్తుల ఎంపిక కాస్త కష్టమే. అందుకే ఒక డ్రెస్ సూట్‌కేస్‌లోకి వెళితే రెండింటిని బయటికి తీస్తుంటాం. ఈ కష్టాన్ని గమనించారు డిజైనర్లు. కాబట్టే 'ట్రిప్ వేర్', 'వెకే వేర్' అంటూ బోలెడు డిజైన్లు తీసుకొచ్చేశారు. ఒకటో రెండో రకాలు కాదు... మ్యాక్సీ డ్రెస్‌లు, ఫ్రాక్‌లు, స్కర్ట్‌లు, ప్యాంట్ సూట్‌లు... ప్రయత్నించాలే కానీ ఎన్నో రకాలు. ఎండలు కదా... తేలికగా ఉండటమూ తప్పనిసరి. అందుకే వాళ్ల ఎంపికా కాటన్, రేయాన్, మల్‌మల్ రకాలే! సన్నని షోల్డర్ స్ట్రాప్ నుంచి ఫుల్ లెంత్ హ్యాండ్ వరకూ ప్రతిదీ ప్రత్యేకమే! బ్యాగ్, పర్స్ బాదరబందీలు వద్దు బాబూ అనుకుంటే పాకెట్ రకాలైనా ఎంచుకోవచ్చు. నీటితో నిండిన బీచ్‌లైనా... పచ్చని మొక్కలతో కూడిన పర్వత ప్రాంతాలైనా... చారిత్రక కట్టడాలున్న ప్రదేశాలైనా... ఏ చోటకైనా నప్పేలా ఉంటాయివి. వాటిలో మీ స్టైల్‌కి సరిపోయేవేంటో ఎంచుకోవడమే మీ వంతు. తీసుకెళ్లడానికి తేలికగా, శరీరానికి హాయిగా, ఫొటోలకు అనువుగా... స్టైల్‌ని హైలైట్ చేస్తూ భలేగున్నాయి కదూ! జీన్స్, టీ షర్ట్‌లను పక్కన పెట్టి వెకే వేర్‌లకు ఓటేయండి మరి!











# ఈ వేసవి సమస్యలకు.. పరిష్కారమిలా..!

**వేసవిలో విపరీతమైన చెమట, డీహైడ్రేషన్, చర్మం పదే పదే జిడ్డుగా మారడం, చెమటకాయలు.. ఎక్కువగా బాధిస్తుంటాయి. వీటికి తోడు ట్యాన్, సన్‌బర్న్.. వంటి సమస్యలూ అందాన్ని దెబ్బతీస్తాయి. ముఖ్యంగా ముఖం, మెడ, వీపు, చేతులపై.. వీటి తాలూకు మచ్చలు స్పష్టంగా కనిపిస్తాయి. అందుకే ఈ వేసవి సమస్యల నుంచి విముక్తి పొందేందుకు పాటించాల్సిన కొన్ని ఇంటి చిట్కాలేంటో**




**ఓట్స్‌తో..!**

స్నానం చేసే నీటిలో ఓట్స్ కలుపుకోవడం ద్వారా వేసవిలో ఎదురయ్యే చర్మ సంబంధిత సమస్యల నుంచి చాలావరకు ఉపశమనం లభిస్తుంది. ఓట్స్ చర్మంపై మూసుకుపోయిన స్వేదగ్రంధులు తెరచుకునేలా చేస్తాయి. తద్వారా చెమటకాయలు తగ్గడంతో పాటు వాటివల్ల కలిగే దురద, మంట.. వంటివి కూడా తగ్గుముఖం పడతాయి. కాబట్టి స్నానం చేయడానికి ఉపయోగించే బకెట్ గోరువెచ్చని నీటిలో కొన్ని ఓట్స్ వేసి కాసేపు నాననివ్వాలి. బాత్‌టబ్‌లో స్నానం చేసేటప్పుడు ఈ చిట్కాను అనుసరిస్తే మరింత మెరుగైన ఫలితం పొందచ్చు.

**ఐస్‌క్యూబ్స్‌తో..**

చెమటకాయలు, వాటి వల్ల వచ్చే దురద, మంట.. వీటి నుంచి విముక్తి పొందడానికి ఇంట్లో లభ్యమయ్యే ఐస్‌క్యూబ్స్‌ని ఉపయోగిస్తే చాలు.. కాటన్ లేదా మెత్తని వస్త్రంలో కొన్ని ఐస్‌క్యూబ్స్ వేయాలి. దానిని మూటలా కట్టి దాంతో సమస్య ఉన్న ప్రదేశంలో మృదువుగా అద్దుకోవాలి. తరచూ ఇలా చేస్తే త్వరగా ఉపశమనం లభిస్తుంది.

**ముల్తానీమట్టితో..**

సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాల కారణంగా సన్‌బర్న్, ట్యాన్.. వంటి సమస్యలు తలెత్తడం సహజం. వాటి నుంచి విముక్తి పొందేందుకు ముల్తానీ మట్టి చక్కగా ఉపయోగపడుతుంది. దీనికోసం రెండు చెంచాల ముల్తానీమట్టిలో సరిపడా రోజ్‌వాటర్ వేసి బాగా మిక్స్ చేయాలి. సమస్య ఉన్న ప్రదేశంలో ఈ మిశ్రమాన్ని అప్లై చేసి పూర్తిగా ఆరేంత వరకు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత చల్లని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజుకోసారి చొప్పున వారం రోజుల పాటు క్రమం తప్పకుండా చేస్తే మంచి ఫలితాన్ని పొందచ్చు. ముల్తానీమట్టికి బదులుగా చందనం లేదా గంధం కూడా ఉపయోగించవచ్చు.

**కీరాదోసతో..**

కీరాదోసని ముక్కలుగా కోసి సమస్య ఉన్న ప్రాంతంలో వాటితో రుద్దడం.. లేదా కీరాదోసను మెత్తని గుజ్జులా చేసి సన్‌బర్న్, ట్యాన్, చెమటకాయలు.. మొదలైనవి ఉన్న ప్రాంతంలో పూతలా అప్లై చేయాలి. ఆ తర్వాత 15 నుంచి 20 నిమిషాలు ఆరనిచ్చి శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే సమస్యలు తొలగిపోవడంతో పాటు చర్మానికి చల్లదనం కూడా అందుతుంది.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్...

## ఆరంభ భారీ లాభాలు ఆవిరి




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం ఒడిదుడుకుల్లో కొనసాగాయి. ఆరంభంలో భారీ లాభాల్లో కొనసాగినప్పటికీ... ఆ తర్వాత లాభాలను కోల్పోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ ఒకానొక సమయంలో 900 పాయింట్లకు పైగా లాభపడింది. ఆ తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు నష్టపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 259 పాయింట్లు లాభపడి 80,501 వద్ద ముగిసింది. నిఫ్టీ 12 పాయింట్ల స్వల్ప లాభంతో 24,346 వద్ద స్థిరపడింది. అమెరికా డాలర్ మారకం విలువతో పోలిస్తే మన కరెన్సీ రూ. 84.50గా ఉంది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:** అదానీ పోర్ట్స్ (4.11%), బజాజ్ ఫైనాన్స్ (2.62%), ఇండస్ ఇండ్ బ్యాంక్ (1.35%), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (1.51%), మారుతి (1.21%).

**టాప్ లూజర్స్:** నెస్లే ఇండియా (-2.04%), ఎన్టీపీసీ (-1.61%), టైటాన్ (-1.09%), కోటక్ బ్యాంక్ (-0.94%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (-0.85%).

## పాక్ ఆంక్షలు.. ఎయిర్ ఇండియాకు

# రూ.వేల కోట్ల నష్టం..!




**న్యూఢిల్లీ:** పెహల్‌గామ్ ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాక్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో.. భారత్‌కు చెందిన ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాకు భారీ నష్టం వాటిల్లనుంది. ఏడాదికి ఏకంగా 600 మిలియన్ డాలర్లు (రూ.5 వేల కోట్లు) నష్టం వాటిల్లుతుందని అంచనా. ఈ మేరకు జాతీయ మీడియాలో వరుస కథనాలు వెలువడుతున్నాయి.

గత నెల 22న పెహల్‌గామ్‌లోని మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్ వ్యాలీలో ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ దాడిలో 26 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. దాయాది దేశంపై భారత్ పలు ఆంక్షలు విధించింది. అందుకు ప్రతిగా పాక్ సైతం ప్రతీకార చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో భారత విమానయాన సంస్థలకు తమ గగనతలాన్ని మూసివేసింది. ఈ నిర్ణయంతో భారత్‌కు చెందిన విమానయాన సంస్థలపై పెను భారం పడనుంది. పాక్ చర్యతో భారత్‌లోని ప్రముఖ ఏవియేషన్ దిగ్గజం ఎయిరిండియాకు వేలకోట్ల నష్టం వాటిల్లింది.

పాక్ గగనతలంపై భారత విమానాల రాకపోకలపై నిషేధం కారణంగా విమానాలు వేరే మార్గాల గుండా ప్రయాణిస్తున్నాయి. ఫలితంగా ప్రయాణ సమయం పెరిగింది. ముఖ్యంగా ఇంధనం ఖర్చు భారంగా మారింది. ఏడాది పాటూ ఇదే పరిస్థితి కొనసాగితే తమ సంస్థకు 591 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఎయిర్ ఇండియా అంచనా వేసింది. ఈ నష్టం నుంచి బయటపడేందుకు ప్రభుత్వం రాయితీ ఇవ్వాలని కోరుతూ విమానయాన శాఖకు ఎయిరిండియా యాజమాన్యం లేఖ రాసినట్లు సమాచారం. ఎయిర్ ఇండియా సహా, ఇండిగో, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు కూడా సూచనలు, సలహాలను పౌర వైమానిక శాఖకు తెలియజేశాయి. వీటిని పరిశీలించి తగిన పరిష్కారం వెతికే పనిలో ఆ శాఖ తలమునకలవుతోంది.

## ఇంకా చెలామణిలో..

# రూ.6,266 కోట్ల విలువైన రూ.2,000 నోట్లు



**న్యూఢిల్లీ:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రూ.2000 నోట్లను రెండేళ్ల కిందట ఉపసంహరించింది. అయినప్పటికీ రూ.6,266 కోట్ల విలువైన రూ.2,000 నోట్లు ఇంకా చెలామణిలో ఉన్నాయి. 2023 మే 19న రూ.2000 నోట్లు వెనక్కి తీసుకుంటున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. ఆ ప్రకటన నాటికి రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2,000 నోట్లు చెలామణిలో ఉన్నట్లు ఆర్బీఐ పేర్కొంది. అయితే 2025 ఏప్రిల్ 30 నాటికి ఇంకా రూ. 6,266 కోట్ల విలువైన రూ.2,000 నోట్లు చెలామణిలో ఉన్నట్లు వెల్లడించింది.

కాగా, 2023 మే 19 నాటికి చెలామణిలో ఉన్న రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2,000 నోట్లలో 98.24 శాతం తిరిగి వచ్చాయని ఆర్బీఐ తెలిపింది. అలాగే ఈ నోట్లను అన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేయడానికి లేదా మార్చుకునేందుకు 2023 అక్టోబర్ 7 వరకు అవకాశం ఇచ్చినట్లు పేర్కొంది.

మరోవైపు 2023 అక్టోబర్ 9 నుంచి 19 ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో రూ.2,000 నోట్లను స్వీకరిస్తున్నట్లు కేంద్ర బ్యాంకు తెలిపింది. వ్యక్తులు, సంస్థలు తమ బ్యాంకు ఖాతాల్లో ఈ నోట్లను జమ చేసుకోవచ్చని పేర్కొంది. ప్రజలు తమ బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ఆర్బీఐ జారీ చేసిన ఏ కార్యాలయానికైనా పోస్ట్ ద్వారా రూ.2000 నోట్లను పంపవచ్చని స్పష్టం చేసింది.




# మళ్లీ ఓడిన ఎస్ఆర్‌హెచ్..

## ప్లేఆఫ్స్ ఆశలు గల్లంతు




**అహ్మదాబాద్:** "ఐపీఎల్ 2024లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు వరుసగా ఆరు మ్యాచులలో గెలిచింది.. మేం కూడా ఆర్సీబీనే ఫాలో అవుతాం.. అన్నింట్లోనూ గెలిచి ప్లే ఆఫ్స్ చేరతాం" ఇది ఐపీఎల్ 2025లో 8 మ్యాచులు ఆడిన తర్వాత సన్ రైజర్స్ ప్లేయర్, హెడ్ కోచ్ చెప్పిన మాటలు ఇవి. కట్ చేస్తే.. ఈ డైలాగ్ చెప్పిన తర్వాతి మ్యాచులో సన్ రైజర్స్ గెలుపొందింది. ఇక సమీకరణం 5/5గా మారింది.

ఇలాంటి పరిస్థితులో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రతి మ్యాచ్ నాకౌట్ లాంటిదే. మ్యాచులో గెలిస్తేనే ప్లే ఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో సన్‌రైజర్స్ ఆటగాళ్లు తేలిపోయారు. చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్ తర్వాత లభించిన సుదీర్ఘ విరామంలో క్రికెట్‌తో సంబంధం లేకుండా వెకేషన్‌కు వెళ్లిన ఆటగాళ్లు.. తీరా మ్యాచులో మాత్రం తేలిపోయారు. శుక్రవారం (మే 2) గుజరాత్ టైటాన్స్‌తో జరిగి మ్యాచులో ఏకంగా 38 పరుగులతో ఓడి.. టోర్నీలో ఏడో ఓటమిని నమోదు చేశారు. దీంతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి దాదాపుగా సన్ రైజర్స్ దూరమైంది!

గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచులో ఫస్టు బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్.. 224/6 పరుగులు స్కోరు చేసింది. సాయి సుదర్శన్ (48) మరోసారి ఆకట్టుకున్నాడు. శుభ్‌మన్ గిల్ (76), జోస్ బట్లర్ (64) రాణించారు. ఈ మ్యాచులో ఆ జట్టు బ్యాటర్లు విశేషంగా రాణించారు. వీలైతే ఫోర్లు, సిక్సర్లు లేదా సింగిల్, డబుల్స్ అన్నట్లు సాగింది గుజరాత్ ఇన్నింగ్స్. దీంతో ఈ మ్యాచ్‌లో గుజరాత్ ఇన్నింగ్స్‌లో కేవలం 22 డాట్ బాల్స్ మాత్రమే నమోదయ్యాయి.

ఐపీఎల్ చరిత్రలోనే ఓ ఇన్నింగ్స్‌లో అతి తక్కువ డాట్ బాల్స్ నమోదు చేసిన జట్టుగా గుజరాత్ టైటాన్స్.. సంయుక్తంగా ప్రథమ స్థానంలో నిలిచింది. గతేడాది ముంబైతో మ్యాచులో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు కూడా 22 డాట్ బాల్స్ నమోదు చేయడం గమనార్హం.

**అత్యల్ప డాట్ బాల్స్ నమోదైన ఐపీఎల్ ఇన్నింగ్స్‌లు..**

22 - సన్‌రైజర్స్ - ముంబై ఇండియన్స్ (2024)
22 - గుజరాత్ టైటాన్స్ - సన్ రైజర్స్ (2025)
23 - ఢిల్లీ క్యాపిటల్స్ - కేకేఆర్ (2020)
23 - ఆర్సీబీ - సన్ రైజర్స్ (2024)
24 - సన్‌రైజర్స్ - పంజాబ్ కింగ్స్ (2017)
24 - గుజరాత్ టైటాన్స్ - సీఎస్కే (2024)

ఇక 225 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ చివరకు 20 ఓవర్లలో 186/6కు పరిమితమైంది. దీంతో 38 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ పాయింట్స్ టేబుల్‌లో ఆర్సీబీని వెనక్కి నెట్టి రెండో ప్లేసుకు వెళ్లింది.

## భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్‌పై

# మూడేళ్ల నిషేధం




**న్యూఢిల్లీ:** భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్‌పై సస్పెన్షన్ వేటు పడింది. కేరళ క్రికెట్ అసోషియేషన్ ఆయనపై మూడేళ్ల నిషేధం విధించింది. అసోషియేషన్‌కు వ్యతిరేకంగా అసత్యపు ఆరోపణలు, కించపరిచే వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆయనను మూడేళ్ల పాటు సస్పెండ్ చేసింది. భారత జట్టులో సంజూ శాంసన్‌కు చోటుదక్కకపోవడంపై నెలకొన్న వివాదం నేపథ్యంలో కేరళ క్రికెట్ అసోసియేషన్‌కు వ్యతిరేకంగా శ్రీశాంత్ కామెంట్స్ చేయడం సస్పెన్షన్‌కు దారితీసింది.

ఇదే అంశాన్ని శ్రీశాంత్ ముందు ప్రస్తావించగా.. సస్పెన్షన్‌కు సంబంధించి కేరళ క్రికెట్ అసోషియేషన్ నుంచి తనకు ఇంకా ఎలాంటి నోటీసులు అందలేదని చెప్పాడు. కేవలం మీడియా ద్వారానే తాను ఈ విషయం తెలుసుకున్నానని అన్నాడు. ఏ కారణం చేత తనను సస్పెండ్ చేశారో తనకు ఇంకా తెలియదని తెలిపాడు. తాను రాష్ట్రానికి చెందిన క్రికెటర్‌కు మద్దతుగా మాట్లాడటం తప్పుకాదని పేర్కొన్నాడు. నోటీసులు అందిన తర్వాత తాను ఏం చేయాలో నిర్ణయించుకుంటానని చెప్పాడు.

# నా అవసరం ఉంటే పిలవండి

## ఇంగ్లండ్ సిరీస్‌లో జట్టును గెలిపిస్తా..!



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 18వ సీజన్ ముగియగానే భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ టీమిండియా ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. అయితే.. నిరుడు చెత్త ప్రదర్శనతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆడే అవకాశం కోల్పోయింది రోహిత్ సేన. దాంతో, ఇంగ్లండ్ సిరీస్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి సీరియస్‌గా తీసుకోనుంది. దాంతో, స్క్వాడ్‌లో ఉండేది ఎవరు? అని అందరిలో ఆసక్తి మొదలైంది. ఈ నేపథ్యంలో ఛతేశ్వర్ పూజారా సెలెక్టర్లకు బంపర్ ఆఫర్ ఇచ్చాడు. తాను ఇంగ్లండ్ సిరీస్‌లో ఆడేందుకు సిద్ధంగా ఉన్నానని, జట్టును గెలిపించే బాధ్యత తనదేనని చెప్పాడీ నయా వాల్.

ద్రవిడ్ తర్వాత టెస్టుల్లో టీమిండియాకు వెన్నెముకగా నిలుస్తూ వచ్చాడు పుజారా, అయితే.. నిరుడు ఇంగ్లండ్ టూర్‌లో పేలవ ఫామ్ కారణంగా జట్టుకు దూరమయ్యాడు. అంతే.. మళ్లీ జట్టులోకి రాలేదు. కానీ, దేశవాళీలో మాత్రం అతడు పరుగుల వరద పారిస్తున్నాడు. మరోసారి తనకు అవకాశం ఇస్తే జట్టును గెలిపించేందుకు సర్వశక్తులు ఒడ్డుతానని అంటున్నాడీ బ్యాటర్. 'భారత జట్టుకు నా అవసరం ఉంటే.. నాకు మళ్లీ అవకాశం వస్తుంది. అందుకు నేను మానసికంగా కూడా సిద్ధంగా ఉన్నాను. ఫిట్‌నెస్ మీద దృష్టి పెట్టాను. దేశవాళీలో దంచేస్తున్నాను.

సో.. ఇంగ్లండ్ పర్యటనలో నా అసవరం కచ్చితంగా రావచ్చు. ఎందుకంటే.. గత 20 ఏళ్లలో అక్కడ భారత జట్టు సిరీస్ గెలవలేదు. కాబట్టి.. ఈసారి మన జట్టు ఆ రికార్డును బ్రేక్ చేయాలని నేను అనుకుంటున్నా. అత్యుత్తమ ప్రదర్శనతో టీమ్‌ను గెలిపించాలని భావిస్తున్నా. వందకుపైగా మ్యాచ్‌లు ఆడిన నాకు జట్టులో చోటు దక్కకపోవడంతో బాధగా ఉంది. కానీ, నేను నిరుత్సాహపడడం లేదు. నన్ను నేను ప్రోత్సహించుకుంటూ సెలెక్టర్ల పిలుపు కోసం ఎదురుచూస్తున్నా' అని చెప్పాడు పుజారా. 2010లో టెస్టు స్పెషలిస్ట్‌గా అరంగేట్రం చేసిన 103 టెస్టులు ఆడిన ఈ సౌరాష్ట్ర క్రికెటర్ 57,195 రన్స్ సాధించాడు.

# నిరీక్షణకు తెర.. ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు స్వీకరించిన సాత్విక్-చిరాగ్




**న్యూఢిల్లీ:** భారత బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టిల నిరీక్షణ ఫలించింది. గత రెండేళ్లుగా నిలకడగా రాణిస్తున్న ఈ ద్వయం ఎట్టకేలకు మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డును స్వీకరించింది. గురువారం కేంద్ర యువజన, క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చేతుల మీదుగా సాత్విక్, చిరాగ్‌లు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అంతులేని సంతోషం వ్యక్తం చేసిన సాత్విక్ భారత ప్రభుత్వం తనను, చిరాగ్‌ను ఎంతగానో ప్రోత్సహించిందని తెలిపాడు.

'ఎట్టకేలకు మేము మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు అందుకున్నాం. ఈ పురస్కారం కోసం రెండేళ్లుగా ఎదురుచూశాం. ఆలస్యం అయినా సరే కేంద్ర క్రీడల శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరించినందుకు సంతోషంగా ఉంది. బ్యాడ్మింటన్‌లో నేను, చిరాగ్ జోడీ కట్టినప్పటి నుంచి భారత ప్రభుత్వం మాకు అన్నివిధాలా ప్రోత్సాహిస్తూ వస్తోంది.

ఈ మధ్య కాలంలో కోర్టులో మేము సాధించిన గొప్ప విజయాలు ప్రభుత్వ మద్దతుకు నిదర్శనం. వరల్డ్ నంబర్ 1గా నిలవడం, ఆసియా గేమ్స్‌లో స్వర్ణ పతకం గెలుపొందడంతో పాటు థామస్ కప్ టైటిల్ కొల్లగొట్టడం ద్వారా యువతలో స్ఫూర్తి నింపడమే కాకుండా యావత్ భారతం గర్వపడేలా చేశాం' అని సాత్విక్ వెల్లడించాడు. ఖేల్ రత్న అవార్డు ప్రదానం సందర్భంగా సాత్విక్ చిరాగ్‌లకు మెడల్‌తో పాటు సర్టిఫికెట్ స్వీకరించారు. అనంతరం బ్యాడ్మింటన్ స్టార్లు మాండవీయకు రాకెట్‌ను బహూకరించారు.

**డబుల్స్‌లో అసమాన విజయాలు**

ఒకప్పుడు పురుషుల బ్యాడ్మింటన్ క్రీడాకారులు అంటే ప్రకాశ్ పదుకొనే, పుల్లెల గోపిచంద్‌లు మాత్రమే గుర్తుకు వచ్చేవాడు. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన ఈ దిగ్గజాలు యువతకు ఆదర్శంగా నిలిచి రాకెట్ పట్టేలా చేశారు. అయితే.. డబుల్స్‌లో అసమాన విజయాలు సాధించిన ఆటగాళ్లు కొందరే. కానీ, ఈమధ్య కాలంలో సాత్విక్ - చిరాగ్ ద్వయం అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ అబ్బురపరిచింది. 2022లో జరిగిన ఆసియా క్రీడల్లో పసిడతో మెరిసిన ఈ జోడీ 2023లో నంబర్ 1 ర్యాంక్ సొంతం చేసుకుంది.

అదే ఏడాది.. స్మాష్‌ను అత్యంత వేగంగా కొట్టిన ఆటగాడిగా సాత్విక్ గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాడు. అతడు గంటకు 565 కిలోమీటర్ల వేగంతో కాక్‌ను బాది ఈ రికార్డు నెలకొల్పాడు. 2024లోనూ కోర్టులో చెలరేగిన సాత్విక్ - చిరాగ్ జంట ఈ ఏడాది మాత్రం పెద్దగా ఆకట్టుకోలేక పోయింది. ప్రస్తుతం డబుల్స్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో భారత జంట 11వ స్థానంలో కొనసాగుతోంది.



# గార్జియస్ లుక్‌లో మానుషి చిల్లర్

టాకీస్: ఈ అమ్మడును చూస్తే ఆ అందానికే అసూయ పుడుతుందేమో.. దివి నుంచి దేవకన్యే భువిపైకి దిగి వచ్చిందా అనేలా తన అందంతో అందరినీ మంత్రముగ్ధులను చేస్తున్నది ఈ అందాల తారా. గులాబీ రంగు చీరలో తన గ్లామర్‌తో మతి పోగొడుతుంది. ప్రస్తుతం మానుషి చిల్లర్ పింక్ శారీలో ఉన్న ఫొటోస్ అందరినీ తెగ ఆకట్టుకుంటున్నాయి. మిస్ వరల్డ్ బ్యూటీ మానుషి చిల్లర్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దు గుమ్మ సొంత. తన అందచందాలతో ఎంతో మందిని తన వైపుకు ఆకర్షించుకుంది. తన గ్లామర్‌తో కుర్రకారును మాయ చేస్తుంది ప్రపంచ సుందరి మానుషి చిల్లర్. అందమే కాదండోయ్.. నటనతో కూడా ఈ బ్యూటీ అందరి మనసు దోచేసింది. బాలీవుడ్ సామ్రాట్ మూవీతో సిల్వర్ స్క్రీన్ పైకి ఎంట్రీ ఇచ్చింది. కానీ ఈ మూవీ హిట్ అందుకోలేదు. అయినా కూడా ఈ అమ్మడుకు వరసగా అవకాశాలు తలుపుతట్టాయి. ఇప్పటికీ ఈ అందాల చిన్నది చాలా సినిమాల్లో నటించింది. కానీ చాలా వరకు సినిమాలు సూపర్ హిట్ అందుకోలేక పోయాయి. దీంతో వచ్చిన ప్రతి అవకాశాన్ని మిస్ చేసుకోకుండా సినిమాలు చేస్తూ వస్తున్నప్పటికీ, ఈ బ్యూటీకి ఒక్క హిట్ కూడా పడలేదు. దీంతో ఈ అమ్మడు గ్రాఫ్ కొద్ది కొద్దిగా తగ్గిపోయింది. టాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ తేజ్ సరసన ఆపరేషన్ వాలెంటైన్ సినిమాలో నటించి మెప్పించింది. కానీ ఈ మూవీ సైతం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. దీంతో తెలుగులో అంతగా అవకాశాలు రాలేదు ఈ చిన్నదానికి. ఇక సినిమాల విషయం ఎలా ఉన్నా ఈ చిన్నది మాత్రం ఎలాంటి పాజిటివ్‌గా ఉంటూ సినిమాలు చేస్తూ వస్తుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ అమ్మడు తాజాగా గులాబీరంగు చీరలో మతిపోగొడుతుంది.



# సూర్య సినిమాలో టాలీవుడ్ క్రేజీ హీరోయిన్

**ఈ కాంబో అదిరిపోతుంది గురూ..**



**టాకీస్:** తమిళ్ హీరో సూర్య ఖాతాలో మరో హిట్టు పడింది. డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఆయన నటించిన రెట్రో సినిమా మే1న విడుదలైన సంగతి తెలిసిందే. మొదటి రోజే ఈ సినిమాకు ఊహించని రెస్పాన్స్ వచ్చింది. తమిళంతోపాటు తెలుగులోనూ ఈ సినిమా పాజిటివ్ రివ్యూస్ అందుకుంది. ఈ సినిమాలో సూర్య సరసన టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే కథానాయికగా నటించింది. ఇక ఈ సినిమా తర్వాత సూర్య ఇప్పుడు తన నెక్ట్స్ ప్రాజెక్ట్ పై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం సూర్య తన తదుపరి సినిమాను డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో చేయనున్నారట. వెంకీ అట్లూరి చివరగా లక్కీ భాస్కర్ సినిమాతో హిట్ అందుకున్నారు. ఇందులో దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి హీరోహీరోయిన్లుగా నటించారు. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31, 2024న థియేటర్లలో విడుదలై భారీ వసూళ్లు రాబట్టింది.

ఇక ఇప్పుడు వెంకీ అట్లూరి, సూర్య కాంబోలో ఓ ప్రాజెక్ట్ రాబోతుంది. దీంతో ఈ సినిమాపై ఇప్పటికే మంచి క్యూరియాసిటి నెలకొంది. వీరిద్దరి కాంబోలో రాబోయే సినిమా గురించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కానీ ఇటీవల హైదరాబాద్ లో జరిగిన రెట్రో మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో సూర్య మాట్లాడుతూ తన నెక్ట్స్ మూవీ వెంకీ అట్లూరితో ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమా షూటింగ్ మే నుండి ప్రారంభమవుతుందని సూర్య కూడా ప్రకటించారు. ఈ చిత్రాన్ని నిర్మాత సితార ఎంటర్టైన్మెంట్స్ వంశీ నిర్మిస్తారని నటుడు సూర్య కూడా ప్రకటన సందర్భంగా పేర్కొన్నారు. ఇక ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన క్రేజీ న్యూస్ ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తుంది.

లేటేస్ట్ సమాచారం ప్రకారం ఈ సినిమాలో సూర్య సరసన టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ నటించనున్నట్లు తెలుస్తోంది.

# 'బకాసుర రెస్టారెంట్' పోస్టర్ విడుదల




**టాకీస్:** కొన్ని రోజులుగా కమెడియన్ ప్రవీణ్ రెస్టారంట్‌ను ప్రారంభించనున్నారనే వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. అయితే ఇదంతా ఓ సినిమా కోసమేనని క్లారిటీ వచ్చేసింది. ఆయన ఏ బిజినెస్ ప్రారంభించడం లేదు. అది సినిమా పేరు మాత్రమే. ఈ విషయాన్ని తెలుపుతూ 'బకాసుర రెస్టారెంట్' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. కమెడియన్ ప్రవీణ్, వైవా హర్ష ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. కృష్ణభగవాన్, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్, ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రం ఎస్‌జే మూవీస్ పతాకంపై రానుంది. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ.. హంగర్ కామెడీ ఎంటర్-టైనర్‌గా ఈ చిత్రం రానుందన్నారు. ప్రవీణ్ కెరీర్‌లోనే గుర్తుండిపోయే చిత్రమవుతుందన్నారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఈ సినిమా కచ్చితంగా నచ్చుతుందన్నారు.

# రెండు ఓటీటీల్లోకి ఓదెల-2 మూవీ

టాకీస్: ఇటీవల విడుదలైన 'ఓదెల 2' మూవీ ఓటిటిలోకి వచ్చేసింది. తమన్నాతో పాటు హెబ్బాపటేల్, వశిష్ట ఎన్ సింహా, మురళీ శర్మ కీలక పాత్రలు పోషించిన ఈ మూవీకి డైరెక్టర్ సంపత్ నంది కథను అందించాడు. ఈ మూవీకి అశోక్ తేజ దర్శకత్వం వహించాడు. ప్రేతాత్మకు, నాగసాధువుకు మధ్య పోరాటం నేపథ్యంలో సంపత్ నంది ఈ కథను రాసుకున్నారు. ఈ నెల 17న రిలీజైన ఈ మూవీ లో ప్రతి ఒక సీన్ డైలాగ్.. భయనకం గానే ఉన్నాయి. ప్రేక్షకులు కూడా బాగా ఎంజాయ్ చేశారు. ముఖ్యంగా తమన్నా ఎంట్రీ ఇచ్చిన తర్వాత కథలో కొంత వైవిధ్యం కనిపిస్తుంది. మునుపెన్నడూ చూడని విధంగా తమన్న తనలోని కొత్త కోణాని చూపించింది. మొదటి భాగంలో కొంత అడల్ట్ కనిపించినప్పటికి.. ఈ రెండో భాగం మాత్రం చాలా డీసెంట్‌గా తీశాడు. కానీ కొంత మంది రొటీన్ స్టోరీలైన్‌తో పాటు ప్రేతాత్మతో నాగసాధువు పోరాటాన్ని పవర్‌ఫుల్‌గా చూపించలేకపోయాడు డైరెక్టర్ అంటూ కామెంట్స్ వినిపించాయి. అయినప్పటికి నాగసాధువుగా తమన్నా యాక్టింగ్‌కు మాత్రం ప్రశంసలు దక్కాయి.ఇక తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ క్షి రిలీజ్ కు సిద్ధం అయింది. ఓదెల 2 మూవీ డిజిటల్ స్ట్రీమ్రింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకున్నది. ఈ నెల 16 నుంచి మూవీ స్ట్రీమింగ్ కానున్నట్లు- సమాచారం. దీని గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అయితే అమెజాన్ ప్రైమ్‌తో పాటు- ఆహా ఓటీటీలోనూ ఓదెల 2 మూవీ స్ట్రీమ్రింగ్ కానుంది. దీని గురించి అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.



# హిట్ టాక్ దక్కించుకున్న రైడ్-2

**టాకీస్:** ఇటీవలి కాలంలో బాలీవుడ్ చిత్రాలు పెద్దగా సక్సెస్ సాధించింది లేదు. ఖాన్ హీరోల సినిమాలకి కూడా ఆదరణ దక్కడం లేదు. దాంతో బాలీవుడ్ పని ఖతమైనట్టే అని అందరు అనుకుంటున్నారు. కాని ఇప్పుడు సీనియర్ హీరో అజయ్ దేవగణ్.. బాలీవుడ్‌కి ఊపిరి పోసాడు. ఆయన నటించిన రైడ్ 2 చిత్రం మంచి హిట్ టాక్ దక్కించుకోగా, తొలి రోజు బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లే రాబట్టింది. అజయ్ దేవగన్, రితేష్ దేశ్‌ముఖ్ నటించిన రైడ్ 2 చిత్రం మొదటి రోజు 18.25 కోట్ల వసూళ్లు సాధించింది. రైడ్ 2 మూవీ 2018లో వచ్చిన రైడ్‌కి సీక్వెల్ గా రూపొందింది. రైడ్ 2 చిత్రం ఐటీ- రైడ్స్ ప్రధానంగా తెరకెక్కగా, ఇందులో సౌరభ్ శుక్లా విలన్ పాత్ర పోషించారు. అదే సమయంలో, రైడ్ 2లో రితేష్ దేశ్‌ముఖ్ విలన్ పాత్రలో నటించారు. దర్శకుడు రాజ్‌కుమార్ గుప్తా రైడ్ 2 చిత్రాన్ని 48 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించగా, ఈ చిత్రానికి భూషణ్ కుమార్, అభిషేక్ పాఠక్, కృష్ణ కుమార్ నిర్మాతలుగా వ్యవహరించారు. వాణీ కపూర్, రజత్ కపూర్, సౌరభ్ శుక్లా, సుప్రియా పాఠక్, అమిత్ సైల్, యశ్‌పాల్ శర్మ, గోవింద్ నామ్‌దేవ్, బ్రిజేంద్ర కాలా ప్రధాన పాత్రల్లో




నటించారు. తొలి రోజు ఈ చిత్రం మంచి వసూళ్లే రాబట్టగా, వారాంతంలో మరిన్ని వసూళ్లు రాబడుతుందని అంటున్నారు. రైడ్ 2 జోరు చూస్తుంటే మొదటి వారాంతంలోనే బ్రేక్ ఈవెన్ అవుతుందనే ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. బాలీవుడ్ సినిమా ఇటీ-వల బాక్సాఫీసు వద్ద స్ట్రగుల్ అవుతున్న నేపథ్యంలో రైడ్ 2 చిత్రం ఊపు తెచ్చేలా కనిపిస్తుంది. రైడ్ 2 సినిమాకు ఏకపక్షంగా హిట్ టాక్ రావడంతో నార్త్ ఇండియాలో ప్రేక్షకుల సానుకూలంగా స్పందించారు. ఓవర్సీస్‌లో ఈ సినిమా 5 కోట్ల మేర వసూళ్లు సాధించవచ్చు అని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. దాంతో ఈ సినిమా తొలి రోజు 20 నుంచి 22 కోట్ల మధ్య కలెక్షన్లు రాబట్టినట్టు- అర్థమవుతుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.